ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
శనివారం 12, సెప్టెంబర్ 2026 16 పేజీలు



# ఇరిగేషన్ ఇంజనీర్లదే..

# పూర్తి బాధ్యత

సీతారామా కాలువల విధ్వంసానికి కారణాలేమిటి
ఫోరెన్సిక్ విచారణ జరిపించారా
శక్తికి మించి విడుదలైన ప్రవాహ వేగమే ధ్వంసం చేసిందా
మరి మరమ్మతుల తర్వాత కూడా ఎందుకు కొట్టుకుపోయింది
ఇప్పుడూ 1700 క్యుసెక్కులే వదిలారా
సిడబ్ల్యుసి నోరు మెదపడంలేదెందుకు
డ్యాంసేఫ్టీ వాళ్లేం చేస్తున్నారు
అసలు మీ విచారణా నివేదికలో ఏం తేల్చారు
ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ని గాలికొదిలేశారా
కాంట్రాక్టర్‌ని బాధ్యుణ్ణి చేసి చేతులు దులుపుకుంటే ఎలా
ఇరిగేషన్ శ్వేతపత్రం విడుదల చేయాలంటూ డిమాండ్లు

**అశ్వారావుపేట/జూలూరుపాడు ప్రభాతవార్త :** ఉమ్మడి ఖమ్మం జిల్లాల సరిహద్దుల్లో సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ మెగా ప్రాజెక్ట్(రాజీవ్‌లింక్) కాలువల సిసి లెయింగ్ సర్వనాశనమవడం., యుద్ధప్రాతిపదికన ధ్వంసమైన చోట్ల తిరిగి మరమ్మతులు చేయడం.,మళ్ళీ అదే ప్రదేశంలో నాసిరకపు భాగోతాలు వీధినపడటం., మనమంతా ఇప్పటిదాకా చూశాం. ఆగష్టు నెల మధ్యలో ఏన్కూరు, జూలూరుపాడు మండలాల పరిధిలో నీటి ప్రవాహానికి కాలువలు అనేక చోట్ల కొట్టుకుపోయిన సంగతి మళ్ళీ చెప్పక్కర్లేదు. ఐతే దాదాపు 20 రోజులు దాటిపోతున్నా ఈ ఉదంతంమీద రాష్ట్ర ఇరిగేషన్ ఉన్నతాధికార్లు చేపట్టిన చర్యలేమిటో ఎవరికీ తెలియడంలేదు. వ్యవహారాన్ని చాలా గోప్యంగా ఉంచడంలోని ఆంతర్యమూ అంతుపట్టదు. నిజానికి సీతారామా లిఫ్ట్ అనేది చిన్నపిల్లల గోళీకాయలాటకాదు. దాదాపు రూ.24వేల కోట్ల ప్రజాధనంతో 7లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకి సాగునీరందించే మహత్తర కార్యం. కేంద్ర జలవనరుల సంఘం, అత్యున్నత స్థాయి పర్యావరణ అనుమతులతో కూడిన మహా యజ్ఞం. అలాంటి భారీ సాగునీటి ప్రాజెక్ట్ కాలువలు సర్వనాశనమైతే.,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కీలక విభాగాలేవీ నోరు మెదపకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

పనిలో నాణ్యత లేక పోయిందా.,లేక 1400 క్యుసెక్కులకు బదులుగా 1700 రావడం మూలంగా నాశనమైందా., ఈ నిగ్గు తేల్చడానికి చేపట్టిన చర్యలేమిటో బయటకు రావడం లేదు. కాంట్రాక్టర్‌దే బాధ్యత కాబట్టి., నాశనమైన ప్రదేశాన్ని అతనే తన సొంత ఖర్చులతో పునరుద్ధరిస్తారంటూ కొందరు కింది స్థాయి ఇంజనీర్లు చిలకపలుకులు పలుకుతున్నారు. నిజమే., కాంట్రాక్టర్ జేబుల్లోంచే తీసి మరమ్మతులు చేశారు. ఫలితం ఏమయింది. రెండు రోజులు తిరక్కముందే., తిరిగి నీళ్లొదలగానే

2వ పేజీలో...



ఎల్‌నినో ప్రభావంతో ..

# ఎండుతున్న పంటలు!

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త :** ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నకు చినుకు జాడ కనిపించడం లేదు. తొలకరి పలకరింపుతో పొలాల్లో విత్తనాలు చల్లిన అన్నదాత.. ఇప్పుడు మబ్బుల కోసం ఎదురు చూస్తున్నాడు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయని ఆశించిన రైతులకు వరుణుడు ముఖం చాటేయడంతో ఆందోళన మొదలైంది. ఎల్‌నినో ప్రభావంతో వాతా వరణ పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పులు, వర్షపాతం లోటు సాగుపై ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పంటల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. వానల కోసం ఎదురుచూస్తూ పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు, కూలీల కోసం పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొస్తే అప్పులు తీర్చుకోవచ్చని భావించారు. కానీ వర్షాభావం కొనసాగితే పెట్టుబడి కూడా దక్కదేమోనన్న భయం వారిని వెంటాడుతోంది.

సీఎస్‌లో...

వానజాడ లేక విలవిలలాడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు..
పెట్టుబడులు చేతికందక, సాయం కోసం ఎదురుచూపులు...
3 లక్షల ఎకరాలలో పత్తి,మరో 3 లక్షల ఎకరాల్లో వరి,45 వేల ఎకరాల్లో మిర్చి సాగు



భద్రాచలంలో బంగారు షాపులపై..

# బీఐఎస్ కొరడా!

## హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ నిబంధనలపై ఆకస్మిక తనిఖీలు

## 522 గ్రాముల బంగారం సీజ్.. 173 ఆభరణాలు స్వాధీనం



16 లో..

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాచలంలో బంగారు ఆభరణాల విక్రయాలపై భారతీయ ప్రమాణాల సంస్థ అధికారులు కొరడా ఝుళిపించారు. హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ, లైసెన్సుల నిబంధనల అమలును పరిశీలించేందుకు శుక్రవారం పట్టణంలోని రెండు బంగారు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీ వెంకటరత్న జ్యువెలరీ, శ్రీదేవి జ్యువెలరీల్లో తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. తనిఖీల సందర్భంగా అధికారులు ఆభరణాలపై ఉన్న హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ వివరాలతో పాటు హాల్ మార్కింగ్‌కు సంబంధించిన లైసెన్సులు, ఇతర రికార్డు లను పరిశీలించినట్లు తెలిసింది.

శ్రీ వెంకటరత్నా, శ్రీదేవి జ్యువెలరీలపై కేసుల నమోదు
తనిఖీల వేళ భద్రాచలంలో పలు షాపులకు షట్టర్లు

## ఇరిగేషన్ ఇంజనీర్లదే పూర్తి బాధ్యత

### మొదటి పేజీ తరువాయి..

మళ్ళీ క్రమేపీ దాని నాణ్యతా బండారం బయట పడుతున్నది. మెల్ల మెల్లగా కొట్టుకుపోవడం మొదలయింది. ఇదేనా ఇన్నివేల కోట్లతో కట్టే సాగు నీటి ప్రాజెక్ట్. కాంట్రాక్టర్ ఇలా తన సొంత డబ్బుతో కొట్టుకుపోయిన ఈ కాలువల్ని ఇలా ఎన్నిసార్లు రిపేర్లు చేసినా ఏం ప్రయోజనం ఉండేలా కనిపించడంలేదు. ఇంతకీ ఈ సంఘటనపై రాష్ట్ర ఇరిగేషన్ ఎలాంటి విచారణ జరిపిందో తెలియదు. స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి దీనిమీద చాలా కోప్పడ్డారు. తక్షణం డ్యాం సేఫ్టీ నిపుణులతో కారణాలను అన్వేషించాలని ఆదేశించారు. మరి ఆ వైపుగా ఏదైనా ప్రగతి ఉందా లేదా అనేది కూడా తెలియడంలేదు. ఈ డబ్బు మంత్రులదో., ఇంజనీర్లదో., కాంట్రాక్టర్లదో కాదు. ప్రతీ పైసా ప్రజల కష్టార్జితం. కస్టోడియన్లుగా వీళ్ళంతా తాజా విధ్వంసానికి నేరుగా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**కేంద్ర జలవనరుల సంఘం నిశ్శబ్దం**

నిజానికి ఈ మెగా కెనాల్స్ డ్యామేజ్ అంశంలో ముందుగా స్పందించాల్సింది కేంద్ర జలవనరుల సంఘం. స్థానిక ఇంజనీర్లు ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్(ఓఅండ్ఎం) సరిగా చేశారా లేదా ప్రాథమికంగా చూడాలి. ఆ వెంటనే "ఎపెక్స్ టెక్నికల్ బాడీ ఫర్ వాటర్ రిసోర్సెస్" నిపుణుల బృందంతో సంఘటనా ప్రదేశాన్ని అధ్యయనం చేసి.,కాలువలు అడ్డగోలుగా కొట్టుకు పోవడానికి గల కారణాలను అన్వేషించి.,సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి. ఇందుకోసం సిడబ్ల్యుసి వారు హైలెవెల్ టీంకి ఈ పని అప్పగించాల్సి ఉంటుంది. సిడబ్ల్యుసి లోని రీజినల్ టెక్నికల్ టీంలు.,స్పెషలైజ్డ్ వింగ్స్., సెంట్రల్ సాయల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్స్(సిఎస్ఎంఆర్ఎస్) ల నేతృత్వంలో"స్పాట్ విజువల్ ఇన్‌స్పెక్షన్ అండ్ ప్రిలిమినరీ ఎసెస్‌మెంట్" రిపోర్ట్ ప్రభుత్వానికి సమర్పించాలి. ఈ విపత్తు కారణంగా ఏదేని సమీప మెగా పంప్‌హౌసెస్, టన్నెల్స్, లేదా జనావాసాలకు నష్టం వాటిల్లుతుందా అనేదీ సమీక్షించాలని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. మరి ఇంత వరకూ కేంద్ర జలవనరుల సంఘం ఆ పనిచేసిందా లేదా అనేది బయటకేమీ పొక్కలేదు. ఒకవేళ ఇలాటి అధ్యయనం చేసి ఉంటే ఖచ్చితంగా సంబంధిత ఇంజనీర్లు విషయాన్ని పత్రికలకు చెప్పవచ్చు కదా. ఎలాటి విచారణ జరిపారో గట్టుచప్పుడు కాకుండా ఉన్నది. అదే విధంగా జాతీయ పర్యావరణ అటవీ విభాగమూ మిన్నకుండిపోతున్నది. ఇదంతా వారు అప్రూవ్‌చేసిన డిజైన్లే. అవే ఇలా చిన్నాభిన్నమైనప్పుడు వారిమీద చాలా బాధ్యత ఉంటుంది. ఎందుకిలా జరిగిందో తక్షణం ఉన్నతస్థాయి అధ్యయనం జరిపించి., లోపాలేమిటో గుర్తించి తదనుగుణ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ వీళ్ళవైపునుంచీ చడీచప్పుడు లేదు.

**మరమ్మతుల తర్వాత ఎందుకు కొట్టుకుపోతున్నది**

ఆగష్టు నెల మధ్యలో కాలువలు కొట్టుకుపోయిన ప్రదేశంలో కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టి నీళ్లు వదిలారు. కానీ ప్రయోజనం ఉన్నట్లు కనిపించడం లేదు. తిరిగి కోతకు గురవుతున్నది. కొన్ని రోజుల పాటు నీళ్ళను ఇలానే పారిస్తే పరిస్థితి దారుణంగా తయారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఐతే రాష్ట్ర ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రజలకు చెప్పాల్సిన సమాధానం ఇక్కడే ఉన్నది. 1400 క్యుసెక్కుల కెపాసిటీ ఉండగా.,పొరపాటున 1700 విడుదల చేసినందుకే తొలుత కాలువల సైడ్ సిసి లెయింగ్ కొట్టుకుపోయిందని హైద్రాబాద్ స్థాయి అధికారులు వెబ్‌సైట్‌లో వివరణ ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభాతవార్త ప్రముఖంగా వెల్లడించిన క్రమంలో దీన్ని ఎవరూ ఖండించకపోవడంతో ఇదే నిజమని అనుకోవాలి. సరే ఏదో పొరపాటు జరిగి 300 క్యుసెక్కుల అదనపు ప్రవాహాన్ని అనుమతించారనే అనుకుందాం. అందుకే విధ్వంసం జరిగిందనీ అంగీకరిద్దాం. ఐతే కాంట్రాక్టర్ మరమ్మతు తర్వాత కూడా కాలువల లెయింగ్ దెబ్బదినే పరిస్థితి ఎందుకు ఉత్పన్నమవుతున్నది. ఇప్పుడూ 300 క్యుసెక్కులను అదనంగా వదిలారా. ఒకసారి దెబ్బతిన్నాక కేవలం వారం రోజుల వ్యవధిలో మళ్ళీ ఇంజనీర్లు అదే తప్పు చేసే పరిస్థితి ఉండదు కదా. అంటే అసలు సమస్య ఇది కాదన్నమాట. కేవలం నాణ్యతా లోపాలవల్లనే జరిగిందన్నమాట. మరిన్ని ఆసక్తికర సాంకేతిక సందేహాలను వరుసకథనాలుగా అందించడం జరుగుతుంది.

---

# చెరువు కడుపులో కాంక్రీట్ సామ్రాజ్యం!







**తూములెన్ని..? అనుమతులెవరివి..?**

**రూ.20 లక్షల డీల్ నిజమేనా..?**

**చింతల చెరువు ఎఫ్‌టీఎల్-బఫర్‌జోన్‌పై ఆర్టీఐతో కదిలిన వ్యవహారం..**

**విద్యానగర్‌లో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై తీవ్ర ఆరోపణలు**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**
చెరువులను కాపాడాల్సిన అధికారులు కళ్లముందే నిర్మాణాలు సాగుతున్నాయా..? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా నోటీసులతోనే సరిపెడుతున్నారా..? లేక తెరవెనుక ఏదైనా 'డీల్' నడుస్తోందా..? ఇప్పుడు కొత్తగూడెం నగరంలో ఈ ప్రశ్నలే చర్చనీయాంశంగా మారాయి. చింతల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాల ఆరోపణలు.. తూముల సంఖ్యపై అధికారిక లెక్కలకు, స్థానికుల వాదనలకు తేడా.. విద్యానగర్ కాలనీలో అనుమతులు లేని భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఒకదానితో ఒకటి ముడిపడి ఉండటంతో వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది.

**రెండు తూములా..? నాలుగు తూములా..?**

చింతల చెరువు విషయంలో అసలు తూముల సంఖ్యపైనే సందిగ్ధత నెలకొంది. చెరువుకు రెండు తూములు మాత్రమే ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే తమకు తెలిసిన మేరకు చెరువుకు నాలుగు తూములు ఉన్నాయని, అందులో రెండు తూములను ప్రస్తుతం కనిపించకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు. తూముల అసలు సంఖ్యను ఇరిగేషన్ రికార్డులు, పాత మ్యాప్‌లు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**ఎఫ్టీఎల్ ఎంత..? బఫర్‌జోన్ ఎంత..?**

చెరువు అసలు విస్తీర్ణం ఎం? ఎఫ్‌టీఎల్ ఎక్కడి వరకు ఉంది? బఫర్‌జోన్ సరిహద్దులు ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తాయి? అనే ప్రశ్నలకు కూడా స్పష్టమైన సమాధానం కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జీవో ఎంఎస్.ఎన్ఓ.168, తదుపరి జిఓ నంబర్.7లోని నిబంధనల ప్రకారం చెరువుల పరిధిలో నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు ఉండటంతో, చింతల చెరువుకు అవి ఏ మేరకు వర్తిస్తాయో అధికారిక మ్యాప్‌లతో వెల్లడించాల్సి ఉంది. ఈ అంశాలపై సమాచార హక్కు చట్టం-2005 కింద ఆర్టీఐ దరఖాస్తు చేయడంతో ఇప్పుడు అధికారిక రికార్డుల కోసం ఎదురుచూపులు మొదలయ్యాయి. చెరువు సర్వే నంబర్లు, మొత్తం విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ మ్యాప్, బఫర్‌జోన్ మ్యాప్, తూముల సంఖ్య, నిర్మాణాలకు ఇచ్చిన ఎన్‌ఓసీలు, తీసుకున్న చర్యల వివరాలను కోరారు.

**నోటీసులు ఇచ్చామంటారు.. నిర్మాణాలు మాత్రం ఆగవు!**

చెరువు పరిధి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై అధికారులు నోటీసులు ఇచ్చినట్లు చెబుతున్నప్పటికీ నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో నోటీసుల తర్వాత వాస్తవంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? నిర్మాణాన్ని నిలిపివేయడానికి ఎందుకు చర్యలు చేపట్టలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**విద్యానగర్ కాంప్లెక్స్‌పై 'రూ.20 లక్షల డీల్' ఆరోపణలు**

ఇక విద్యానగర్ కాలనీలో అనుమతులు లేని భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం మరో వివాదానికి కేంద్రంగా మారింది. నిర్మాణానికి సంబంధించి రూ.20 లక్షల డీల్ కుదిరిందని, అందుకే అనుమతులు లభించాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతున్న నేపథ్యంలో.. అసలు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరు ఇచ్చారు? ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారు? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అయితే రూ.20 లక్షల డీల్ జరిగిందన్న ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణలు నిజమా కాదా అన్నది తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. అనుమతులు, ఫైల్ నోట్లు, నిర్మాణ అనుమతి పత్రాలు, తనిఖీ నివేదికలు బయటపెడితే వాస్తవం ఏంటో స్పష్టమవుతుంది.

**కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు.. ఎవరి పాత్ర ఎంత?**

నిర్మాణాలు కొనసాగుతున్నా చర్యలు ఎందుకు నిలిచిపోయాయి? క్షేత్రస్థాయి అధికారులు పరిశీలనలు చేశారా? చేసినట్లయితే ఏం గుర్తించారు? నోటీసుల తర్వాత తదుపరి చర్యలు ఎందుకు చేపట్టలేదు? వంటి ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలకు ఆధారాలు బయటకు రావాల్సి ఉన్నప్పటికీ, వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**'1/70'లో పర్మిషన్ ఎలా..?**

చెరువు, నీటి వనరుల పరిధికి సంబంధించిన నిబంధనలు ఉన్నప్పుడు నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరయ్యాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సంబంధిత జీవో, భవన నిర్మాణ నిబంధనలు, ఎఫ్‌టీఎల్ మ్యాప్, బఫర్‌జోన్ పరిమితులు, అనుమతి ఫైళ్లను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఆర్టీఐ సమాధానాలే కీలకం**

చింతల చెరువు విషయంలో తూముల అసలు సంఖ్య నుంచి ఎఫ్‌టీఎల్ వరకు.. బఫర్‌జోన్ నుంచి నిర్మాణ అనుమతుల వరకు.. విద్యానగర్ కాంప్లెక్స్ అనుమతుల నుంచి అధికారుల చర్యల వరకు ఎన్నో ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఆర్టీఐ ద్వారా వచ్చే అధికారిక సమాధానాలు ఈ ఆరోపణలకు చెక్ పెడతాయా? లేక మరిన్ని ప్రశ్నలకు తావిస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. చెరువులు, ప్రభుత్వ భూములు ప్రజా ఆస్తులుగా ఉన్న నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడంతో పాటు, బాధ్యులు ఎవరైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చింతల చెరువు ఎఫ్‌టీఎల్, తూములు, బఫర్‌జోన్, నిర్మాణ అనుమతులపై పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు: అనూష, జిల్లా పంచాయతీ అధికారి**

జిల్లా కేంద్రం సమీపంలోని అక్రమ కట్టడంపై జిల్లా పంచాయతీ అధికారిని అనుషను వివరణ కోరగా... చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీలో 1/70 చట్టాన్ని, సింగరేణి దొప్పును, చెరువు పూర్తిస్థాయి నీటిమట్టపు నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న భారీ వాణిజ్య సముదాయ నిర్మాణం జరిగిన ఊరుకునేది లేదని స్పష్టం చేసారు. తక్షణమే స్పందించి విచారణకు హామీ ఇచ్చారు. పునాదిలో మోకాళ్ళ లోతు నీరు నిలిచి ఉన్న పై అంతస్తు నిర్మాణం యథేచ్ఛగా సాగుతూ ఉండడం ప్రమాదకరంగా మారింది. అన్ని విషయాలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**నేనొక్కడినే ఎం చేయగలను: పంచాయతీ కార్యదర్శి**

భావన నిర్మాణానికి నేను పంచాయతీ తరపున"నేను ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. నేను ఇప్పటికే నాలుగైదు సార్లు నోటీసులు ఇచ్చాను. అయినా కూడా కడుతున్నారు. నేను ఎస్సైకి, డిఎస్పీ కి ఫిర్యాదు చేశాను. ఒకసారి ఎస్సై వచ్చి ఆపు చేయించారు. కానీ వాళ్ళు మళ్ళీ కడుతూనే ఉన్నారు. నేను తహసీల్దార్ కి కూడా చెప్పాను, మా డీపీవో కి కూడా చెప్పాను. వారు కూడా మాట్లాడారు కానీ వాళ్ళు కడుతూనే ఉన్నారు. నేను 24 గంటలు నా పనులు మానుకొని నిర్మాణ ప్రదేశంలో కాపలా ఉండలేను కదా. నేను ఒక్కడినే దొరికానా? తహసీల్దార్ ఉన్నారు, పోలీస్ అధికారులు ఉన్నారు, గిరిజన చట్టాల అధికారులు ఉన్నారు.. వీళ్ళందరూ ఏం చేస్తున్నారు? అందరూ నన్నే అంటున్నారు. నేను ఒక్కడినే ఏం చేయగలను? అది అక్రమ కట్టడం అని తెలిసినా, ఎవరైనా పోలీస్ అధికారి వచ్చి గట్టిగా మాట్లాడి ఆపితే ఆగుతుంది కదా." అంటూ సెక్రెటరీ తన ఆవేదనను, నిస్సహాయతను వెళ్లగక్కారు. సెక్రెటరీ స్వయంగా ఇన్ని సార్లు ఫిర్యాదు చేసినా, పోలీసులు వచ్చి ఆపినా మళ్ళీ మొదలవుతుందంటే దీని వెనుక ఎంతటి రాజకీయ, అధికార అండదండలు ఉన్నాయో అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**చింతలచెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి: బలగం శ్రీధర్**

విద్యానగర్ కాలనీలోని చింతలచెరువును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని చుంచుపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బలగం శ్రీధర్ ఆరోపించారు. చెరువుకు గతంలో నాలుగు తూములు ఉండగా, ఆక్రమణల కారణంగా ప్రస్తుతం రెండు తూములు మాత్రమే కనిపిస్తున్నాయని తెలిపారు. చెరువు, ఆయకట్టు భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తక్షణమే ఆక్రమణలను గుర్తించి నిర్మాణాలను నిలిపివేసి, చెరువు హద్దులను కాపాడాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని బలగం శ్రీధర్ హెచ్చరించారు.

# మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో విద్యుత్‌శాఖలో విచారణ

**కింది స్థాయి సిబ్బంది ఫిర్యాదులపై వరంగల్ నుంచి వచ్చిన అధికారులు విచారణ**

కొత్తగూడెం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

విద్యుత్‌శాఖలో కింది స్థాయి సిబ్బందిపై అధికారుల వేధింపులు, విధి నిర్వహణలో ఒత్తిళ్లు, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు విచారణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా వరంగల్ నుంచి వచ్చిన ఎస్ఈ స్థాయి అధికారులు కొత్తగూడెం డివిజన్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత సిబ్బంది నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది. గతంలో విద్యుత్‌శాఖకు చెందిన ఓ కింది స్థాయి అధికారి తనపై ఉన్నతాధికారి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. లంచాలు ఇప్పించాలంటూ ఒత్తిడి చేయడం, తాను అందుకు అంగీకరించకపోవడంతో బెదిరింపులకు పాల్పడటం, విధి నిర్వహణలో వివక్ష చూపడం, శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం వంటి పలు ఆరోపణలు ఫిర్యాదులో ఉన్నట్లు తెలుస్తోంది. తనకు, తన కుటుంబానికి ఇబ్బందులు కలిగే పరిస్థితి ఏర్పడిందని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఫిర్యాదుపై మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిర్యాదుదారుడి వద్ద ఉన్న ఆధారాలను కూడా విచారణాధికారి ఎదుట సమర్పించినట్లు సమాచారం. గత ఫిర్యాదులపైనా చర్చదే వ్యవహారానికి సంబంధించి గతంలో కూడా శాఖాపరంగా ఫిర్యాదులు, విచారణలు జరిగినట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో జరిగిన కొన్ని విచారణల్లో వచ్చిన నివేదికలపై కూడా ఉద్యోగులు సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒక నివేదికకు మరో నివేదికకు పొంతన లేదని, నిబంధనల ప్రకారం అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. అందరినీ విచారిస్తారా? ప్రస్తుతం జరుగుతున్న విచారణలో గతంలో ఆరోపణలు చేసిన లేదా సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్న సిబ్బంది అందరినీ విచారిస్తారా? లేక కొంతమందికే పరిమితం చేస్తారా? అనే చర్చ ఉద్యోగ వర్గాల్లో సాగుతోంది. ఫిర్యాదులో ప్రస్తావించిన అంశాలకే పరిమితమై విచారణ జరుగుతోందా, లేక డివిజన్ పరిధిలోని ఇతర ఫిర్యాదులను కూడా పరిశీలిస్తారా అనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా, విచారణ సందర్భంగా తమ వాంగ్మూలాలను మానవ హక్కుల కమిషన్‌కు నేరుగా సమర్పించేందుకు కొంతమంది ఉద్యోగులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. విచారణ పూర్తయిన అనంతరం అధికారులు సమర్పించే నివేదికలో వాస్తవాలు ఏ మేరకు వెలుగులోకి వస్తాయనేది వేచి చూడాల్సి ఉంది. ఈ విషయంపై విచారణ అధికారిగా వరంగల్ ఎస్ఈ ఇంక్వైరీస్ విచారణ చేపట్టారు. ఈ విషయంపై వారం రోజుల క్రితం నుంచి విచారణ చేపడుతున్నాం. ఇందులో మొత్తం 58 మందిని విచారించడం జరుగుతుందని చెప్పారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేస్తే సహించం

**జూనియర్ కళాశాల సమస్యలపై పూర్వ విద్యార్థులు ఆరా...**

చింతకాని ప్రభాత వార్త సెప్టెంబర్ 12



గత కొన్ని రోజులుగా నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంటున్న పరిణామాలు...ఇటీవల విద్యార్థులు చేపట్టిన ధర్నా.. అనంతరం చోటుచేసుకున్న వివాదలపై కళాశాల పూర్వ విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీలుకు సంబంధించిన ప్రజా సంఘాల నాయకులు స్పందించారు... ఈ సందర్భంగా వారు కళాశాలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాలలో నెలకొన్న పరిస్థితులపై తమ ఆవేదన నిరసనను వ్యక్తం చేశారు గత నాలుగు సంవత్సరాలుగా కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధన సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు ఈ సమస్యను 2024లోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. చదువుకోవాలనే తపనతో కష్టాలను భరిస్తున్న విద్యార్థులపై వ్యక్తిగత వేధింపులకు పాల్పడటం అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంబంధిత ఇంగ్లీష్ అధ్యాపకుడిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు సమస్యను పరిష్కరించాల్సిన స్థానంలో సరస్వతి నిలయమైన కళాశాలలోకి రాజకీయ జోక్యం తీసుకురావడం సరికాదన్నారు కళాశాలలోని ఇతర అధ్యాపకుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఎగతాళి చేసేలా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్నారు కళాశాలలో విద్యార్థులకు, ఒక అధ్యాపకుడికి మధ్య చోటుచేసుకున్న అంశాన్ని రాజకీయంగా మలచడం సరికాదని స్పష్టం చేశారు. అసలు సమస్యను పక్కదారి పట్టించే విధంగా విద్యాలయాల్లో కులాల పంచాయతీలు, సిబ్బంది మధ్య వర్గపోరు వంటి అంశాలను తెరపైకి తీసుకురావడం సరికాదన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తూ సంబంధిత అధ్యాపకుడిని కాపాడేందుకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు నిస్వార్థంగా పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే అధ్యాపకులపై ఎలాంటి దాడులు జరిగినా సహించబోమని స్పష్టం చేశారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతిష్ఠను కాపాడటంతో పాటు, అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు అలాగే కళాశాలలో జరిగిన పరిణామాలపై జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి వివరించినట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి, జరిగిన సంఘటనపై పూర్తి వివరాలను సేకరించి తప్పు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు ఈ సమావేశంలో తీళిశి మధిర నియోజకవర్గం ఇన్‌చార్జి దారెల్లి రమేష్, తిరుమలాపురం సర్పంచ్ చేపల మడుగు వీరబాబు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగయ్య లీళిశిళీ చింతకాని మండల మాజీ అధ్యక్షులు గుండ్ల రాంబాబు, స్వేరో మధిర నియోజకవర్గం అధ్యక్షులు శ్యామ్, బోనకల్ మండల లీళిశిళీ అధ్యక్షులు మాగి ముకేశ్, లీళిశిళీ గ్రామ శాఖ అధ్యక్షులు నాగేంద్రబాబు నారపోగు, మండల లీది సెల్ నాయకులు దర్శ బాలకృష్ణ, తీళిళీ మండల నాయకులు ఐతం ఆదినారాయణ, ళీగి సెల్ మండల నాయకులు కొమ్ము క్రిష్ణ, జొన్నలగడ్డ పుల్లారావు, కొమ్ము నరేష్, కోట వెంకట రత్నం, చెట్టిపోగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల లబ్ధిదారుల జాబితా పరిశీలన

తల్లాడ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

మండల పరిధిలోని మల్లారం గ్రామంలో చేయూత పెన్షన్ల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను అధికారులు పరిశీలించారు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను తీసుకొని అధికారులు వారింటికి వెళ్లి లబ్ధిదారులు అర్హుల కాదా అనే విషయం స్వయంగా లబ్ధి దారుల్ని అడిగి తెలుసుకున్నారు వారు దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డులు ఆధార్ కార్డులు బ్యాంక్ అకౌంట్ల ను తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ శ్రీధర్ రాజు సర్పంచ్ కటి కిరణ్ కుమార్ డిపిఎం విష్ణు రాజేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి షేక్ సిద్ధిక్ మియా ఫీల్డ్ అసిస్టెంట్ పైల పుల్లయ్య పాల్గొన్నారు



## నేరాలు-దారుణాలు

# ఆశా కార్యకర్త తాటి రమణ మృతి



ఏన్కూరు, సెప్టెంబర్ 11, ప్రభాత వార్త

మండల పరిధిలోని నాచారం ఆరోగ్య ఉపకేంద్రంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న గంగుల నాచారం గ్రా మానికి చెందిన తాటి రమణ శుక్రవారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఏన్కూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నంద్యాల బాలకృష్ణతో పాటు వైద్య..ఆరోగ్య సిబ్బంది తీవ్ర సంతా పం వ్యక్తం చేశారు. రమణ మృతి విషయం తెలుసుకున్న వైద్యాధికారి డాక్టర్ నంద్యాల బాలకృష్ణ..కమ్యూనిటీ హె ల్త్ ఆఫీసర్ గొంది వెంకటేశ్వర్లు..వైద్య సిబ్బంది..ఆశా కార్యకర్తలు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వే సి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిరుపేద కుటుంబానికి అండగా..తాటి రమణ నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన మహిళ కావడంతో..ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఏన్కూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి..సిబ్బంది..ఆశాకార్యకర్తలు మానవతా దృక్పథంతో ముం దుకు వచ్చారు. తమ వంతు సహాయంగా అందరూ కలిసి సుమారు 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని రమ ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన వైద్యాధికారి..వైద్య ఆరోగ్య సి బ్బందిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నంద్యాల బాలకృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గొంది వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువకుడు అదృశ్యంపై

చంద్రుగొండ ప్రభాతవార్త



తెల్లం చరణ్ 17 అనే యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది... పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామపంచాయతీ రావక్క బంజర గ్రామానికి చెందిన తెల్లం చరణ్ ( 17) ఈనెల 8వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో కంగారు పడిన తండ్రి తెల్లం రాంబాబు చంద్రుగొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అదృశ్యమైన యువకుడి ఎత్తు 5.6 అంగుళాలు, యువకుడి వద్ద ఎలాంటి మొబైల్ ఫోన్ లేదు.. కావున ఈ యువకుడి ఆచూకీ తెలిసినవారు వెంటనే చంద్రగొండ పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ కోరారు.

# రాయపట్నంలోపొలం బాట కార్యక్రమం..

మధిర సెప్టెంబర్ 11 ప్రభాతవా ర్త



మధిర మండల పరిధిలోని రాయ పట్నం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని శుక్ర వారం నిర్వహించారు గ్రామ సర్పంచ్ కంచం గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో టౌన్ ఏఈ ఎస్ అనిల్ కుమార్ రైతులుకి అవగాహన కల్పించారు. రైతుల యొక్క మోటార్లకు కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలని , కెపాసిటర్లను ఏర్పరచుకోవడం వల్ల వోల్టేజ్ హెచ్చుతగ్గుల నుండి రైతుల యొక్క మోటార్ను రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలోని లైన్ ఇన్స్పెక్టర్ నారాయణ రెడ్డి, లైన్మెన్ రాజు రైతులు పాల్గొన్నారు.




## గెస్ట్ ఫ్యాకల్టీ మెరిట్ జాబితాలపై అభ్యంతరాలు

### 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలి

### ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, సెప్టెంబరు 11(ప్రభాతవార్త):



2026-27 విద్యా సంవత్సరానికి ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి రూపొందించిన తాత్కాలిక మెరిట్ జాబితాలను విడుదల చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శుక్రవారం తెలిపారు. దరఖాస్తుదారులు తమ పేర్లు, విద్యార్హతలు, మెరిట్ వివరాలు, ఎస్ఈటీ/నెట్ పీహెచ్‌డి తదితర అంశాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కార్యాలయ పనివేళల్లో ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏ, భద్రాచలంలో నేరుగా సమర్పించాలని పేర్కొన్నారు. గడువు అనంతరం అందే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అర్హతలు, నియామక నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

## ఏజెన్సీ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

### ఉపాధ్యాయుల సమస్యలపై తక్షణమే దృష్టి సారించాలి

### విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

### టి.ఎస్.టి.టి.ఎఫ్. రాష్ట్ర అధ్యక్షుడు ఈరు నాయక్

భద్రాచలం, సెప్టెంబరు 11(ప్రభాతవార్త):

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు ఈరు నాయక్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం భద్రాచలంలోని ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన విద్యా వాతావరణం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యాయులు శోభన్, మోతీలాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి వినాయకుడే మేలైన పర్యావరణ రక్షకుడు

### విద్యార్థులతో మట్టి ప్రతిమల తయారీ

### వినాయక చవితి రోజున ఉచిత పంపిణీ

భద్రాచలం, సెప్టెంబరు 11(ప్రభాతవార్త):



రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారు చేశారు. పట్టణ ప్రజలకు వీటిని వినాయక చవితి రోజున ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్, కల్చరల్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి మట్టి వినాయక ప్రతిమలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించడం వల్ల నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను భద్రాచలం పట్టణ ప్రజలకు పండుగ రోజున ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ హితమైన వినాయక చవితిని నిర్వహించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కపిల భారతి, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ బి. సుధాకర్‌రావు, ఎన్ఎస్ఎస్ పీఓ. డాక్టర్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

భద్రాచలం క్రైమ్, సెప్టెంబర్ 11(ప్రభాతవార్త):

భద్రాచలం పాత ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ శరత్ మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు జీవన్, డి. నాగలక్ష్మి ఆధ్వర్యంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్నవారిని గుర్తించి, వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఆసుపత్రి సొంత వాహనంలో వరంగల్‌కు తరలించారు. ఆపరేషన్లు పూర్తయిన అనంతరం వారిని తిరిగి భద్రాచలంలోని అసోసియేషన్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి దింపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, గౌరవాధ్యక్షులు చంద్ర సుబ్బయ్య చౌదరి, మాదిరెడ్డి రామమోహనరావు, ఉపాధ్యక్షులు ఎస్. రాజబాబు, టీ. శివప్రసాద్, మురళీకృష్ణ, సూరిశెట్టి కృష్ణ, బన్సీ లాల్, శ్యామ్‌సుందర్‌రావు, నాళం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ఆదివాసీ వలస గ్రామాల సంక్షేమానికి పోలీసు శాఖ కృషి

### కందిపాడు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌డీఎస్పీ అరుణ్ కుమార్

చర్ల, సెప్టెంబర్ 11( ప్రభాతవార్త)



వలస ఆదివాసీల గ్రామాల ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కృషిచేస్తుందని డిఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం కందిపాడులో పోలీస్ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారీకి పాల్పడవద్దని సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాలు మరియు వినియోగం వల్ల కుటుంబాలపై, ముఖ్యంగా యువతపై పడే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. అక్రమ గుడుంబా తయారీ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామంలోని యువత, పిల్లలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తూ గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం, మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందనే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు వర్మ ఎస్సైలు నర్సిరెడ్డి కేశవ్ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## వలస ఆదివాసి కుటుంబాలకు షిలోహు మిషనరీ ఆధ్వర్యంలో దోమతెరల పంపిణీ

### 250 కుటుంబాలకు రూ.1.25 లక్షల విలువ కలిగిన దోమతెరల అందజేత

సారపాక, ప్రభాతవార్త:



భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలలో ఛత్తీ సగ్గడ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ఆదివాసి కుటుంబాలకు హైదరాబాదుకు చెందిన షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ లోకి ఆధ్వర్యం లో రూ ఒక లక్ష 25 వేల విలువ కలిగిన దోమ తెరలను పంపిణీ చేశారు. శుక్రవారం సారపాక లోని గాంధీనగర్ సీయోను ప్రార్థన మందిరంలో ములుగు జిల్లాలోని తాడ్వాయి, మంగ పేట, సినపాక మండలాలోగల శాంతినగర్, కేఎం నగర్, ఎర్రకుంట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని మలకలపల్లి మండలం పాత గుండాల పాడు, పాలవాగు ప్రాంతాల్లోని వలస ఆదివాసి కుటుంబాల ప్రాంతాల్లో పనిచేస్తున్న పాస్టర్లకు అందజేశారు. ఈదోమతెరలను షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మోజేస్ ము లక చేతుల మీదుగా అందజేశా రు. అదేవిధం గా పాలవాగు గ్రామంలోని వలస ఆదివాసి వి ద్యార్థులకు అవసరమైన పలకలు, బలపాల ను ఆయన అందజేశారు.

**యేసు చూపిన ప్రేమను పంచాలని...**

ఈ లోక రక్షకుడు క్రీస్తు యేసు ప్రేమను అంద రికి పంచాలనే ఉద్దేశంతో షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వలస ఆదివాసికుటుం బాలకు ఈ వర్షాకాల సీజన్ లో ఎంతో అవసర మైన దోమతెరలను పంపిణీ చేసినట్లు పాస్టర్ మోజేస్ ములక తెలిపారు. ఛత్తీసగఢ్, వలస ఒరిస్సా ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వచ్చిన వలస ఆదివాసులు వర్షాకాల సమయంలో దోమల బెడదతో డెంగ్యూ, మలేరి యా, టైఫాయిడ్ ఇతర విష జ్వరాల బారిన పడి అనేకులు మృత్యువాతకు గురవుతు న్నారని ఆయన అన్నారు. ఈ వలస ఆదివాసి కుటుంబాలకు ఈ వర్షాకాల సీజన్ లో దోమల వల్ల జ్వరాల బారిన పడకుండా ఈ దోమ తెరలను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొ న్నారు. వలస ఆదివాసులు తమ పిల్లలను చిన్నవాటి నుంచి చదివించాలని విద్య తోనే ఈకుటుంబాలలో జీవన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా తమ పిల్లలను చదివించడంలో ఆదివాసుల తల్లిదండ్రులు వెనకంజ వేయవద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో షిలోహు మిషనరీ బృందం సభ్యులు పాస్టర్ పెద్దారావు, పాస్టర్ టి.ఎం.కు మార్, ఏరియా ఇన్చార్జులు పాస్టర్ ఇర్వాపాల్, పాస్టర్ బెంజిమెన్, పాస్టర్ రత్నకుమార్, పాస్టర్ స్టీవెన్ బాబు,బ్రదర్, ఇమ్మానియేల్,బ్రదర్ ,మోతుకూరి విజయ్ చరణ్ పాల్గొన్నారు.

# సాగునీరు, కరెంటు కష్టాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం

**సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**తక్షణమే సాగునీరు, విద్యుత్ అందించాలి: ముందే తెలిసిన ఎల్‌నినో ముప్పుపై ప్రణాళికేది? కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతుల అవస్థలు: పువ్వాడ**

ఖమ్మం అర్బన్, సెప్టెంబర్ 11(ప్రభాత వార్త )

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, విద్యుత్ కష్టాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు అవసరమైన సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం



స్పందించకపోవడం వల్ల ప్రస్తుతం పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ పాలన కారణంగా పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులకు తక్షణమే అవసరమైన సాగునీరు, విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి అత్యవసర ప్రాతిపదికన సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# పారంపర్య వైద్యానికి ప్రభుత్వ గుర్తింపునివ్వాలి

**పూర్వ వైభవం తీసుక రావాలి**

ఖమ్మం టౌన్,ప్రభాతవార్త సెప్టెంబర్ 11:

పారం పర్య వైద్యానికి ప్రభుత్వం గుర్తింపు నివ్వాలని పారంపర్య వైద్య మహా సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 8,9,10 తేదీల్లో భద్రాచలంలో అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి ల నిత్య అన్నదాన సత్రంలో పారం పర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ మేరకు సదస్సు వివరాలను సంఘం గౌరవ సలహాదారులు రామదుగు వీరభద్రాచారి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు . ఈ సదస్సు కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, బీహార్,కేరళ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి పారం పర్య వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సులో భారతీయ సనాతన ఆయుర్వేద సిద్ధ వైద్యం, వైద్య విధానాలు , వైద్య గ్రంథాలు , దేశమంతటా వేల సంవత్సరాల నుండి విస్తరించి ఉన్న మన దేశ వారసత్వ సంపదకు మనమంతా వారసులమేనన్నారు. మన వైద్యాన్ని మనం పరిరక్షి ంచుకోవాల్సిన బాధ్యత మనపై





ఉందని తెలిపారు. మన పారం పర్య వైద్యానికి ప్రభుత్వం నుండి తగిన గుర్తింపు ను సాధించేందుకు ఈ పారం పర్య వైద్య మహా సంఘం ముందుకు సాగుతున్నట్లు పలువురు వక్తలు ఉద్ఘాటించినట్లు తెలిపారు . ఈ సదస్సు కు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సంఘం గౌరవ సలహాదారు రామదుగు వీరభద్రాచారి స్వయంగా తయారు చేసిన జీవ గడియారం (బయో క్లాక్)ను శివక్షేత్ర పీఠాధిపతులు శివ స్వామీజీ చేతుల మీదుగా ఆయురారోగ్య ప్రదాత అయిన శ్రీ ధన్వంతరీ భగవానుడి కాంస్య విగ్రహాన్ని బహుకరిస్తూ అభినందించి ఆశీర్వదించినట్లు తెలిపారు. తెలంగాణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొంత యాత్రీ మహర్షి , ఏపీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్ శ్రీనివాసులు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ పుత్తూరు సెల్ల వైద్యులు చంద్రశేఖర రాజు, వైద్య రత్న, అడవిదేవుడు జమాల్ ఖాన్, యోగి శ్రీ సిద్ధ రామయ్య, మెడిటస్ ప్రొఫెసర్ టీడీయా బెంగుళూరు హరిరామ మూర్తి, గౌరవ అధ్యక్షులు సర్పన రమేష్, గౌరవ సలహాదారులు దాడే వెంకట్రావ్ , ఉపాధ్యక్షులు కామంచి శ్రీనివాస్, భాను ప్రసాద్, కోశాధికారి దుర్గా. రాణి, ఉప కోశాధికారి అరుణాజ్ సహాయ కార్యదర్శులు రాజయ్య, రామకృష్ణయ్య, వెంకటేశ్వర రెడ్డి, వహీద్ అలీ, పద్మారావు, మోహన్ , రవీందర్, ఆనందం, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొని అభినందించారు. ఈ జీవ గడియారం ప్రాముఖ్యత : శరీరంలోని త్రి దోషాలైనా వాత, పిత్త, కఫం సమతుల్యతపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఈ మూడు దోషాలు ఏ మాత్రం అసమ తుల్యతకు గురైనా రోగాల బారిన పడతామన్నారు. ఈ జీవ గడియారం ఏ సమయంలో ఏ పని చేయాలనేటువంటి దినచర్యను, ఆయా సమయాలలో వాత , పిత్త, కఫాల దోషాలను తెలుపుతుందన్నారు. ఈ జీవ గడియారం నిరంతరం దినచర్య తో పాటు మనకు క్రమశిక్షణ నేర్పుతుందని వివరించారు.

# కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**పోలీస్ కమిషనర్**

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త.

ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.కొత్త క్రిమినల్ చట్టాలు-2023 అమలులోకి వచ్చిన నేపథ్యంలో 500 మంది సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు గత వారం రోజులుగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని (సిటీసి) సిటీ



ట్రైనింగ్ సెంటర్ నిర్వహించారు. ఈ శిక్షణలో ..భారతీయ న్యాయ సంహిత-2023 (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత-2023 (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం-2023 (బీఎస్ఏ)..లోని ముఖ్యమైన నిబంధనలు, కొత్త చట్టాల ప్రకారం కేసుల నమోదు, దర్యాప్తు విధానం, సాక్ష్యాల సేకరణ, డిజిటల్ మరియు ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రాధాన్యత, బాధితుల హక్కులు, అరెస్టు-రిమాండ్ ప్రక్రియ, కోర్టు విచారణ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కొత్త చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కొత్త చట్టాల అమలులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సిటీసీ ఏసీపీ హరినాద్ బాబు, ఆర్ ఐ నాగుల్ మీరా పాల్గొన్నారు.

# నేడు (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

**జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ నాగరాజు**

ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్ 11: ( ప్రభాతవార్త)

నేడు (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం న్యాయ సేవా సదన్ నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ను రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





## చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

**ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతా చంద్రరావు**

ప్రభాతవార్త గాంధీ చౌక్ సెప్టెంబర్ 11



సెప్టెంబర్ 13 వ తేదీ ఆదివారం ఉదయం గం. 800 లకు ఉప్పల్ భగాయత్ లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయాల చారిత్రాత్మక నిర్మాణానికి భూమి పూకార్యక్రమం, మరియు శ్రీనివాస కళ్యాణం జరుగుతుంది. తదనంతరం ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయుచున్నారు. కావున ఈ సమావేశానికి మన ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య బంధు మిత్రులందరూ తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతాచంద్రరావు కోరారు.ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, మండల కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాలు యువజన సంఘం, మహిళా సంఘం, సేవాదళ్, రాజకీయ విభాగం, విద్యా కమిటీల సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, మాజీ జిల్లా కోశాధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాల్సిందిగా పసుమర్తి కోరారు.

## మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం టౌన్,ప్రభాతవార్త,సెప్టెంబర్ 11 :



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభించారు. నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఓల్డ్ బస్టాండ్, కల్వొడ్డు, ఇల్లందు క్రాస్‌రోడ్ తదితర ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ఉపయోగించి పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సుజాత, నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం దిగ్బంధనం

**వైటీపీఎస్ లో ప్రైవేటీకరణకు**

**వ్యతిరేకంగా ఉద్యోగుల ఆందోళన**

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటీకరించేందుకు టెండర్లు పిలవడాన్ని వ్యతిరేకిస్తూ కేటీపీఎస్‌లో ఉద్యోగులు, కార్మికులు ఆందోళనకు దిగారు. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కేటీపీఎస్ 5, 6 దశల ఆధ్వర్యంలో కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయాన్ని ఉద్యోగులు దిగ్బంధించారు. చీఫ్ ఇంజనీర్ ఛాంబర్‌లోకి వెళ్లిన ఉద్యోగులు



ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే నేలపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ... గత నెల 29న జరిగిన జాయింట్ సమావేశంలో ప్రభుత్వంతో చర్చించి 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, అందుకు విరుద్ధంగా టీజీ జెన్‌కో యాజమాన్యం టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి 'పవర్‌మెక్' సంస్థకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఉద్యోగ, కార్మిక సంఘాల అభ్యంతరాలను పట్టించుకోకుండా టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జనరేషన్ స్టేషన్లలో ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. జేఏసీ నాయకులు ఉమామహేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, భాగ్యరాజ్, అఖిల్, శ్రీపాల్, కోటేశ్వరరావు, పుల్లారావు, సురేంద్రాచారి, రాధాకృష్ణ, యాదగిరి, రాజాబాబు, రజీం, రిజ్వానా, నాగేశ్వరరావు, రామదాసు పాల్గొన్నారు.

## బ్యాంకుల సమ్మెతో ఖాతాదారులకు తప్పని తిప్పలు

**కొత్తగూడెంలో సేవలు నిలిపివేసి ఉద్యోగుల నిరసన**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):




బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడింది. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు జిల్లాలోని వివిధ బ్యాంకుల ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐదు రోజుల పనిదినాల అమలు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు నినాదాలు చేశారు. బ్యాంకులు పనిచేయకపోవడంతో నగదు లావాదేవీలు, ఇతర అత్యవసర బ్యాంకింగ్ పనుల కోసం వచ్చిన ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు సానుకూల నిర్ణయం తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని కామ్రేడ్లు అరుణ్‌కుమార్ నారెడ్డి, కోలా నవీన్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది సందీప్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

చుంచుపల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):

మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పెనుబల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను పూజించి వినూత్నంగా సందేశాన్ని అందించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, రసాయన రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని విద్యార్థినులు తెలిపారు. అందువల్ల మట్టి గణపతులను పూజించి, నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితిని జరుపుకోవచ్చని పేర్కొన్నారు. "మట్టి గణపతినే వాడుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని విద్యార్థినులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శారద. హరిలాల్ సుజాత. రాజా. విజయ.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధిని సత్కరించిన కొత్వాల

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస రెడ్డిని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా విద్యానగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మీడియా సమావేశంలో మద్ది శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తో పాటు కొత్వాల, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై కేవలం దళితుడనే ఉద్దేశ్యంతో ఉద్దేశ్య పూర్వకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు మరో ఎమ్మెల్సీ లు అనుచిత వ్యాఖ్యలు చేశారని, వారిని వెంటనే పదవి నుండి బర్తరఫ్ చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులకు దళితులంటే ఏహ్యాభావన ఉందని, దళితులను తక్కువగా చూడటం పరిపాటి అయిందన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చారు.. చేసి చూపించారు!

**ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ లావుడ్య పూర్ణ**

**ఐదుగురికి ఉచిత కంటి ఆపరేషన్లు**

**రవాణా, భోజనం, వసతి ఖర్చులు భరింపు**

లక్ష్మీ మ్రేదేవిపల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):



ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ లక్ష్మీ మ్రేదేవిపల్లి మండలం పెద్దతండా సర్పంచ్ లావుడ్య పూర్ణ సేవా కార్య క్రమాలు చేపడుతున్నారు. ప్రతి ఏటా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తానన్న హామీలో భాగంగా ఈ నెల 8న గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఖమ్మంలోని అగర్వాల్ ఆసుపత్రికి తరలించారు. ఆపరేషన్ ఖర్చులతో పాటు రవాణా, భోజనం, వసతి ఖర్చులను స్వయంగా భరించి, ఆపరేషన్లు పూర్తైన అనంతరం సొంత వాహనంలో వారిని ఇంటికి చేర్చారు. మరికొందరికి కంటి ఆపరేషన్లు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలోనూ ఏడుగురికి సొంత ఖర్చులతో కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తన బాధ్యతని సర్పంచ్ పేర్కొన్నారు. ఆమె సేవలను గ్రామస్తులు అభినందించారు.

## పేదరికం చదువుకు అడ్డు కాకూడదు

**విద్యార్థుల భవిష్యత్తుకు చేతన ఫౌండేషన్ అం**

**రెండు పాఠశాలల్లో బ్యాగులు, స్టేషనరీ పంపిణీ**

చుంచుపల్లి, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):




ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తూ చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. చుంచుపల్లి మండలం పెనగడప ఎంపీపీఎస్ పాఠశాలలో చేతన ఫౌండేషన్ సహకారంతో నిరుపేద విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి బి. నీరజ హాజరై తన చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు రవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాములు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా లక్ష్మీ మ్రేదేవిపల్లి మండలం హోలీ తండా మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా చేతన ఫౌండేషన్ సహకారంతో బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సర్పంచ్ భారతి, ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి పి. కృష్ణయ్య హాజరై విద్యార్థులకు బ్యాగులను అందజేశారు.

## నేడే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులలో జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెం లీగల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత తెలిపారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, కుటుంబ వివాదాలు తదితర రాజీ ద్వారా పరిష్కరించదగిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన, సులభంగా, ఖర్చు లేకుండా లేదా స్వల్ప వ్యయంతో, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల సమ్మతితో కేసులు పరిష్కరించబడటం వల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కావున కక్షి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వెట్టి చాకిరి హింసకు వ్యతిరేకంగా పుట్టిందే సాయుధ పోరాటం

**..సాయుధ పోరాటం లో కమ్యూనిస్టుల పాత్ర అజరామరం.**

-మధిర సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



నిజాం నియంతృత పాలనలో వెట్టి చాకిరి హింస బానిసత్వాలకు వ్యతిరేకంగా పుట్టిన ఉద్యమ జ్వాల సాయుధ పోరాటం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పట్టణం లోని రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి వాసిరెడ్డి వెంకటపతి స్మారక స్థూపానికి నివాళులర్పించి, అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి పోరాటాన్ని నడిపారని అన్నారు. .తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర చరిత్రాత్మకమని కొనియాడారు. రజాకార్ల అరాచకాలతో చితికిపోయిన ఎన్నో కుటుంబాలు కమ్యూనిస్టులు పిలుపుతో ఉద్యమంలోకి అడుగులు వేసాయని అన్నారు మధిర ప్రాంతం నుంచి నల్లమల గిరిప్రసాద్, వాసిరెడ్డి వెంకటపతితో పాటు ఎంతోమంది నేతలు రజాకార్లను ఎదుర్కొని తరిమికొట్టారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల, బయ్యారం, ఇల్లెందు ప్రాంతాల్లో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతంగా కొనసాగాయన్నారు. మధిర నియోజకవర్గంలోని ప్రతి పల్లె నిజాంకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిందని, మధిర సమీపంలోని అల్లీనగరం గ్రామస్తులు రజాకార్లను తరిమి తరిమి కొట్టారని గుర్తుచేశారు. దీనికి ప్రతీకారంగా రజాకార్లు మరింత భారీ సేనలతో వచ్చి ఇళ్లను తగలబెట్టారని, గోవిందా పురంలోనూ ఇలాంటి దుర్ఘటనే జరిగిందన్నారు. ఆనాడు రజాకార్ల తూటాలకు సుమారు 50 మంది బలయ్యారని, వారి మృతదేహాలను సైతం గ్రామాల్లో ఊరేగించి పైశాచికానందం పొందారని పేర్కొంటూ ఆవేదనతో అమరుల కు నివాళులర్పించారు. ..ఈ చారిత్రాత్మక పోరాటం ఫలితంగానే పది లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచగలిగామని తెలిపారు. నాలుగు వేల మంది అమరవీరుల బలిదానంతోనే ప్రజలకు విముక్తి లభించిందన్నా రు. రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని, నేటి ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ శ్రేణులు సమరశీల పోరాటాలు సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రహీం, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామానుజనం, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, తలారిరమేష్ నాగకృష్ణ, నాయకర్, రామారావు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగ పై అవగాహన

**బోనకల్, ప్రభాతవార్త :**






స్థానిక ప్రభుత్వ జూనియర్ ఆధ్వర్యంలో కళాశాల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థులకు అవగాహన పై ప్రిన్సిపాల్ శ్రీమతి నళిని శ్రీ అధ్యక్షతన ఇషా ఫౌండేషన్ నుంచి ముఖ్యఅతిథిగా వచ్చిన యోగ ట్రైనర్ కుమారి కొప్పుల పూజిత మాట్లాడుతూ యోగా వలన వ్యక్తిగత పరివర్తన, శారీరిక మానసిక ఆధ్యాత్మిక శ్రేయస్సు మరియు యోగా, ధ్యానం ద్వారా విద్యార్థులకు భావోద్వేగాలను ఎలా కంట్రోల్ చేసుకోవాలో వివరించారు, శరీరానికి, మనసుకు మరియు మెదడుకు ఉన్న అనుబంధాన్ని కోపాన్ని, బాధని, సంతోషాన్ని ఎలా కంట్రోల్ చేసుకోవాలో విద్యార్థులకు వివరించారు, విద్యార్థులచే యోగాసనాలు వలన ఉపయోగాలను చెప్తూ ఆసనాలను వేయించారు. తోప్పు కారణము ఆసనం ద్వారా మెదడు పనితనం పెరుగుతుందని వివరించారు. ఇంటర్మీడియట్ బోర్డ్. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులు యోగ చేయించడం వలన కలిగే లాభాలను ప్రతి విద్యార్థి ఆచరించడం ద్వారా ఏకాగ్రతను సాధించి మంచి మార్కులు తెచ్చుకోవాలి అని విద్యార్థులను ఆదేశించారు మరియు ఇషా ఫౌండేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ ఈ విద్యార్థులు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

**బోనకల్, ప్రభాతవార్త :**



తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమేనని తెలంగాణ సాయుధ పోరాటాన్ని కూడా బిజెపి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని ఈ తప్పుడు ప్రచారాన్ని కమ్యూనిస్టు శ్రేణులు తిప్పి కొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పిలుపునిచ్చారు. భారతదేశంలో అత్యంత భ యంకర రుడు, అతిపెద్ద బకాసురుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని, మతోన్మాద విధానా లతో దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేస్తున్నాడని పోతినేని ఘాటుగా విమర్శల వర్షం కురిపించారు. మండల కేంద్రంలోని వివిఆర్ గార్డెన్లో సిపిఎం మధిర డివిజన్ విస్తృత సమావేశం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావే శంలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం గుత్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిందన్నారు. నైజాం నవాబు ప్రజాకా రుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ సా యుధ పోరాటం కొనసాగిందన్నారు. ఈ పోరాటం కమ్యూనిస్టులు మాత్రమే చేశారన్నారు. కానీ నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటం పై తప్పుడు ప్రచారానికి దిగిందని విమర్శించారు. దీనిని హిందూ ముస్లిం పోరాటంగా బిజెపి ప్రచారం చేస్తుందని విమర్శించారు. వాకలి ఐల మ్మ ఈ పోరాటంలో కీలక పాత్ర నిర్వహిం చిందన్నారు.

దున్నేవానికే భూమి అనే నినాదంతో ఈ పోరాటం కొనసాగిందని 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిందన్నారు. నైజాం నవాబు కింద 50 లక్షల భూమి ఉందన్నారు. పోరాటంతో 3000 గ్రామాలు విముక్తి అయ్యాయన్నారు. బిజెపి ప్రభుత్వం హిందూ సమ్మేళనం పేరుతో దేశాన్ని విచ్చిన్నం చేసేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీ సందర్భంగా విద్యార్థులపై బీజేపీ ప్రభుత్వం కర్కశంగా లాఠీచార్జి చేసిందన్నారు. 23 లక్షల మంది నీటి పరీక్షలు రాస్తే ప్రశ్నాపత్రం లీకేజీ ఫలితంగా 25 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న అన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 390 రోజులపాటు ఢిల్లీలో రైతులు ఆందోళన నిర్వహించారన్నారు. దాని ఫలితంగానే ఆ చట్టాలను ప్రభుత్వం రద్దు చేసింది అన్నారు. కమ్యూనిస్టులపై బిజెపి ప్రభుత్వం విషయం కక్కుతుందన్నారు. మధిరలో అనేకమంది ఎమ్మెల్యేలుగా పనిచేశారని కానీ ఏ ఎమ్మెల్యేకి కమిషన్ ఎమ్మెల్యేగా పేరు రాలేదని కానీ ప్రస్తుత డిప్యూటీ సీఎం గా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు మాత్రం కమిషన్ మంత్రిగా పేరు వచ్చిందని పెద్దవా చేశారు. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన ప్రతి ఒక్కరు మధిరకు మంచి పేరు తీసుకువస్తే మల్లు భట్టి విక్రమార్క మాత్రం కమిషన్ మధిరగా మార్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని జేఎన్టీయూ యూనివర్సిటీ కి 46 సార్లు ఎన్నికలు జరిగితే 44 సార్లు ఎస్ఎఫ్ఐ విజయం సాధించింది అన్నారు.




# నిష్కలంక యోధులు రావెళ్ల జానకీరామయ్య



**బోనకల్, ప్రభాతవార్త :**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, తామ్రపత్ర గ్రహీత రావెళ్ల జానకీరామయ్య నిష్కలంక యోధులని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం అధ్యక్షులు జక్కుల రామారావు కొనియాడారు. మండలంలోని చిరునోముల గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్స వాల్లో భాగంగా తొలి రోజు జానకీరామయ్య స్మారక స్థూపానికి పూలమాలలు వేసి వారోత్సవాలను సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కుల రామారావు మాట్లాడుతూ జానకీరామయ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. ఆంధ్ర మహాసభను నిర్వహించడంతో పాటు రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. వత్సవాయి మండలంలోని వేములనర్వ క్యాంపును నిర్వహించడంలోనూ ఆయన ముఖ్య భూమిక పోషించారని పేర్కొన్నారు. నాటి పోరాట యోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు ఆకెన పవన్, ఏఐకేఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, చిరునోముల సీపీఐ గ్రామ కన్వీనర్ గుంపుల జయరాజు, టీడీపీ నాయకులు గొల్లపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ యువజన నాయకులు బిరెల్లి కార్తీక్, నారపోగు బాబురావు, బత్తినేని నాగేశ్వరరావు, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి



**మధిర సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి పంటలలో దిగుబడులు సాధించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఐ వాణిశ్రీ కోరారు. శుక్రవారం మధిర మండలం పరిధిలోనిఖమ్మంపాడు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అవలంబించి పంటలలో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, ఎరువులు పురుగుమందులను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని కోరారు. ప్రస్తుత పంటల పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, ఏవో సాయి దీక్షిత్ కోరారు. సమతుల్య ఎరువుల వినియోగం, పురుగు–తెగుళ్ల నివారణ మరియు శాస్త్రీయ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ద్వారా నిర్వహిస్తున్న రైతు శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యాన పంటల సాగులో నూతన సాంకేతిక పద్ధతులు, పంటల యాజమాన్యం, పురుగు–తెగుళ్ల నివారణ మరియు ఉద్యాన పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై ఉద్యానవనాధికారి విష్ణు రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ అంజన బాబు మాట్లాడుతూ రైతుల కోసం ఆత్మ వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులతో పంటల సాగుకు సంబంధించిన అంశాలపై చర్చించి, వారి సందేహాలకు వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారులు సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓలు సుష్మ, ప్రవళిక, జిష్ణు ఖమ్మంపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ఎండుతున్న పంటలు!

**వానజాడ లేక విలవిలలాడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు..**

**పెట్టుబడులు చేతికందక, సాయం కోసం ఎదురుచూపులు...**

**3 లక్షల ఎకరాలలో పత్తి,మరో 3 లక్షల ఎకరాల్లో వరి,45 వేల ఎకరాల్లో మిర్చి సాగు**

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త

ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నకు చినుకు జాడ కనిపించడం లేదు. తొలకరి పలకరింపుతో పొలాల్లో విత్తనాలు చల్లిన అన్నదాత.. ఇప్పుడు మబ్బుల కోసం ఎదురు చూస్తున్నాడు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయని ఆశించిన రైతులకు వరుణుడు ముఖం చాటేయడంతో ఆందోళన మొదలైంది. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పులు, వర్షపాతం లోటు సాగుపై ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పంటల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. వానల కోసం ఎదురుచూస్తూ పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు, కూలీల కోసం పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొస్తే అప్పులు తీర్చుకోవచ్చని భావించారు. కానీ వర్షాభావం కొనసాగితే పెట్టుబడి కూడా దక్కదేమోనన్న భయం వారిని వెంటాడుతోంది.

**మొలక దశలోనే ముప్పు..**

వర్షాధారంగా సాగు చేసే పంటలకు సరైన సమయంలో వర్షం కురవడం అత్యంత కీలకం. విత్తిన తర్వాత మొలకెత్తేందుకు తేమ అవసరం. ఆ తర్వాత పంట ఎదుగుదలకు కూడా నిరంతర తేమ ఉండాలి. వర్షాలు ఆలస్యమైతే విత్తనాలు మొలకెత్తడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పటికే మొలకెత్తిన పంటలకు తేమ అందకపోతే ఎదుగుదల మందగిస్తుంది.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, కంది తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సాగునీటి లభ్యతను బట్టి



పంటల పరిస్థితి మారుతున్నప్పటికీ.. వర్షాధార భూముల్లో మాత్రం రైతుల ఆందోళన ఎక్కువగా కనిపిస్తోంది. వర్షం కోసం పొలంవైపు చూస్తున్న రైతుకు ఎండలు, ఉక్కపోత మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

**పత్తి రైతుల్లో ఆందోళన..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటి. పత్తి సాగుకు రైతులు ఎకరాకు భారీగా పెట్టుబడి పెడుతున్నారు. విత్తనాల నుంచి ఎరువులు, కలుపు నివారణ, పురుగుమందులు, కూలీల వరకు ఖర్చు తప్పదు. పంటకు కీలక దశలో తగినంత వర్షం లేకపోతే మొక్కల పెరుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉంది.ఒకవైపు పెట్టుబడి వ్యయం పెరుగుతుండగా.. మరోవైపు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. పంటను కాపాడుకునేందుకు బోర్లు, బావుల ద్వారా నీటిని అందించగలిగిన రైతులు కొంతవరకు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నీటి వసతి లేని రైతులు మాత్రం వాన కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**మిరప రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరం**

మిరప సాగు చేసే రైతులకు కూడా వాతావరణ పరిస్థితులు కీలకమే. నారు పెంపకం, నాట్లు, పంట ఎదుగుదల సమయంలో సరైన తేమ అవసరం. వర్షాల తీరులో మార్పులు రావడంతో పంట నిర్వహణ రైతులకు సవాల్‌గా మారుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, తేమలో మార్పులు, వర్షాల అసమానత పంటపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పంట బాగుండాలంటే ఎరువులు వేయాలి.. పురుగు మందులు పిచికారీ చేయాలి. కానీ పంట చేతికొచ్చే పరిస్థితి లేకపోతే ఆ ఖర్చంతా రైతుపైనే భారం అవుతుంది. దీంతో మరింత అప్పు చేయాల్సి వస్తుందన్న భయం రైతులను వెంటాడుతోంది.



**అప్పులు.. పెట్టుబడులు.. వర్షం కోసం ఎదురుచూపులు**

రైతు పంట వేయకముందే ఖర్చు మొదలవుతుంది. దుక్కులు దున్నించడం, విత్తనాలు కొనడం, ఎరువులు వేయడం, కూలీలను పెట్టుకోవడం.. ఇలా సాగు ప్రారంభం నుంచే పెట్టుబడి అవసరం. చాలామంది రైతులు సొంత డబ్బుతో పాటు బ్యాంకులు, సహకార సంఘాలు, ప్రైవేటు అప్పులపై ఆధారపడుతున్నారు.పంట పండితే వచ్చిన ఆదాయంతో అప్పులు తీర్చాలని భావిస్తారు. కానీ ప్రకృతి సహకరించకపోతే పరిస్థితి తలకిందులవుతుంది. వర్షాభావం కొనసాగితే పంట నష్టంతో పాటు అప్పుల భారం పెరిగే ప్రమాదం ఉంది. దీంతో రైతుల కుటుంబాల్లో ఆర్థిక ఆందోళన నెలకొంటోంది.

**ప్రభుత్వం ఏం చేయాలి?**

వర్షాలు లేక పంటలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని అంచనా వేయాల్సిన అవసరం ఉంది. మండలాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాలి. వర్షాభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలి.అవసరమైన చోట్ల సాగునీటి వనరుల వినియోగంపై రైతులకు సూచనలు ఇవ్వడంతో పాటు.. ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగు చేసే పంటలపై అవగాహన కల్పించాలి. పంటలు దెబ్బతిన్నట్లు నిర్ధారణ అయితే నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి ప్రభుత్వ సహాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.అదే సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని అన్నదాతలు కోరుతున్నారు. పంటలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కార మార్గం చూపేలా వ్యవస్థ పనిచేయాలని అంటున్నారు.

**'వాన పడితేనే మా బతుకు'**

రైతు జీవితం ప్రకృతితో ముడిపడి ఉంటుంది. ఒక మంచి వర్షం అతని కుటుంబానికి ఆశను ఇస్తుంది. ఒక వర్షాభావ కాలం అతని కుటుంబాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే ప్రమాదం ఉంది. అందుకే ఆకాశంలో మేఘం కనిపిస్తే రైతు ముఖంలో చిరునవ్వు వస్తుంది. చినుకు పడితే పొలంలోకి పరుగెత్తుతాడు.ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు రైతుల పరిస్థితి ఇదే. "పంట కోసం పెట్టుబడి పెట్టాం.. ఇప్పుడు పంటను కాపాడుకోవడానికి వాన కోసం చూస్తున్నాం".. అన్న ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది.ఎల్‌నినో వంటి వాతావరణ ప్రభావాలు, వర్షపాతంలో అసమానతలు రైతుల నియంత్రణలో ఉండవు. కానీ ప్రకృతి ప్రతికూల పరిస్థితుల్లో రైతును ఆదుకోవడం మాత్రం ప్రభుత్వాల బాధ్యత. వర్షాలు మరింత ఆలస్యమైతే పరిస్థితి ఎలా మారుతుంది? ఎంత మేర పంటలకు నష్టం వాటిల్లుతుంది? అనే అంశాలపై అధికారులు ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.పొలంలో పచ్చదనం తగ్గకముందే.. రైతు ముఖంలో ఆశ చిగురించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతకు ప్రకృతి కరుణతో పాటు ప్రభుత్వ భరోసా కూడా అవసరం.

# పోలీసు స్టేషన్లో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**ఎస్పీ రోహిత్ రాజ్ పోలీసు స్టేషన్లో రికార్డులను తనిఖీ చేసిన ఎస్పీ**

**పెండింగ్ కేసులపై ఎస్పీ ఫోకస్ అక్రమ ఇసుక, పశువుల రవాణాపై కఠిన చర్యలు**

**భద్రతా పర్యవేక్షణను పగడ్బందీగా నిర్వహించాలి**



అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 11(ప్రభాతవార్త)



భద్రాద్రికొత్తగూడెం జిల్లా సూపరింటెండెంటు ఆఫ్ పోలీసు(ఎస్పీ)రోహిత్ రాజు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషను హౌస్ను శుక్రవారం సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీసు స్టేషన్లో రికార్డులు. ఫిర్యాదుల రిజిస్టర్లు. నేరాల నమోదు. పెండిం గు కేసుల వివరాలను క్షుణ్ణంగా ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను నిబద్ధతతో పకడ్బందీగా ఎప్పటికప్పుడు నవీకరించాలని. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి.సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ... నిందితులను త్వరగా గుర్తించి. అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. పోలీసు స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0 లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సీఐఆర్ పోర్టల్, ఈ సాక్ష, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాల దర్యాప్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఎస్పీ తెలిపారు.

సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.అక్రమ ఇసుక, పశువుల రవాణా పై చర్యలుఅక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని. అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.నేరస్తులు పై నిఘానేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలుపై అవగాహన కార్యక్రమాలుగంజాయి అక్రమ రవాణా. వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా గ్రామాల్లో ...విద్యాసంస్థల్లో... విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిం చాల న్నారు. ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకుని. ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని పోలీసులను ఆదేశించారు. పోలీసు స్టేషన్కు వచ్చిన బాధితులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ... సత్వర న్యాయం జరిగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిం చాలని. పెట్రోలింగ్ వాహనాలు. పోలీసుస్టేషన్లో మౌలిక వసతులను పరిసరాలను అధికారి పరిశీలించి. స్టేషను ఆవరణంలో మొక్కను నాటేరు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, ఎస్హెచ్ఓ విజయసింహారెడ్డి,ఎఎస్ఐ పెంటయ్య, హెడ్ కానిస్టేబుల్లు కృష్ణమోహన్,దామోదర్, పోలీసు సిబ్బంది రాజు, సలీం పాష , జాన్ పాషా, సురేష్, కృష్ణరావు, ఈశ్వరరావు, లక్ష్మణ్, శ్రీను, మహిళా కానిస్టేబుల్లు రమాదేవి, అశ్విని, తదితరులు ఉన్నారు.

# ఉద్యానవనంలో.... అడ్డగోలు వ్యాపారం

**"మిరప నర్సరీ"ల్లో ఇష్టారాజ్యంగా మొక్కల పెంపకం**

**నాణ్యతలేని మిరప నారుతో నష్టపోతున్న రైతాంగం**

**గత ఏడాది వందల ఎకరాల్లో పంటకు తెగుళ్ల వ్యాప్తి**

**నర్సరీలకు లైసెన్సులిచ్చి సరిపెట్టుకుంటున్న యంత్రాంగం**

జూలూరుపాడు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 11

ప్రైవేటు వాణిజ్య మిరప నర్సరీల ఏర్పాటుతో పాటు అడ్డగోలు వ్యాపారానికి జూలూరుపాడు అడ్డాగా మారింది. గత ఎనిమిదేళ్లుగా ఒకరి వెంట మరొకరు మండల కేంద్రంలో మిరప నర్సరీలను ఏర్పాటు చేసి వ్యాపారాన్ని విస్తరించేందుకు మొగ్గు చూపారు. మిరప నర్సరీల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నారు అమ్మకాల వ్యాపారం సాగించి నిర్వాహకులు లక్షలు ఆర్జిస్తుండటంతో ఈ ప్రాంతంపై కొందరు వ్యాపారులు కన్నేశారు. జిల్లాలోని కొణిజర్ల, తల్లాడ, వైరా, కల్లూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు ఈ ప్రాంతంలో భూములను లీజుకు తీసుకొని నర్సరీలను ఏర్పాటు చేశారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం, కాకర్ల, గుండెపుడి, సాయిరాం తండా పలు గ్రామాల పరిధిలో మండలంలో మొత్తం18 అధికారిక నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ నర్సరీల నిర్వహణపై సీజన్లో ప్రతి ఏటా ఉద్యానవన శాఖ అధికారుల తనిఖీలు లోపించడం వల్ల వేలాది మంది మిరప రైతులు నాణ్యత లేని నారు, నకిలీ విత్తనాలతో మోసపోతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో మిరప సాగు వైపు మొగ్గు చూపే రైతులకు భరోసా ఇవ్వాల్సిన ఉద్యానవన శాఖ నిఘా కరువవడంతో ప్రైవేట్ నర్సరీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బ్రాండెడ్ కంపెనీల పేరుతో తక్కువ రకం లేదా నాణ్యత లేని విత్తనాలను ఉపయోగించి మొక్కలు పెంచడం, రైతులు అడిగిన అధిక దిగుబడి ఇచ్చే రకం కాకుండా, తక్కువ రకం మొక్కలను అంటగట్టి మోసాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక నర్సరీలలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల తెగుళ్లు, వైరస్ సోకిన మొక్కలను రైతులకు అమ్మడంతో ఇవి పొలంలో నాటిన కొద్దిరోజులకే చనిపోతున్న సంఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. కొంతమంది నర్సరీల నిర్వాహకులు మొక్కలు అమ్మినప్పుడు రైతులకు ఎలాంటి బిల్లులు లేదా రశీదులు కూడా ఇవ్వటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధిక లాభాల కోసం కొన్ని నర్సరీల యాజమాన్యాలు గుర్తింపు లేని కంపెనీల విత్తనాలతో నారు పెంచుతున్నాయి. సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించకుండా



షేడ్ నెట్లలో పెంచే నారుకు ఆదిలోనే బొబ్బర, నల్ల తామర పురుగులు, వైరస్ వంటి తెగుళ్ల సోకుతున్నాయి. ఇటువంటి నారును పొలాల్లో నాటడం వల్ల పంట చేతికి వచ్చేసరికే పంట పూర్తిగా దెబ్బతిం టోంది. ఇంతేగాక ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ట్రేలలో పెంచే ఒక్కో మొక్కకు నిర్వాహకులు ఇష్టానుసారంగా ధరలు వసూలు చేస్తున్నారు. గత ఏడాది వెంగన్నపాలెం, సాయిరాం తండా, గుండెపుడి, కాకర్ల ప్రాంతాల్లో రైతులు తమ భూముల్లో నాటిన రోజుల వ్యవధిలోనే మొక్కలకు తెగుళ్ల వ్యాప్తి చెంది చనిపోయాయి. మొక్కలను పూర్తిగా తొలగించి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను సాగు చేసుకోవాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. దీని కారణంగా రైతాంగం లక్షల్లో ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. సీజన్లో రెండు, మూడు నెలల్లోనే మండలంలోని నర్సరీల్లో నారు అమ్మకం వ్యాపారం కోట్లలో సాగుతోంది. ప్రైవేటు మిరప నర్సరీల ఏర్పాటుకు లైసెన్సులు ఇవ్వడంతోనే ఉద్యానశాఖ సరిపెట్టుకుంటుందని, ఆ తర్వాత నర్సరీల నిర్వహణపై పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు కొరవడిన కారణంగానే నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవసానంగా ప్రతి ఏటా మిరప రైతులు నష్టపోతున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉద్యానశాఖ అధికారి కిషోర్ మాట్లాడుతూ మిరప నర్సరీలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

# విద్యార్థులు లలిత కళల వైపు దృష్టిసారించాలి



**ఎస్పీ రోహిత్ రాజు**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల వైపు దృష్టిసారించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.శుక్రవారం సాయంత్రం రామకృష్ణ శారదాకుటీర్ అర్ధనారీశ్వర స్వామి దేవాలయంలో అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ కుటుంబ సభ్యులకు 81 స్వర అర్చన కార్యక్రమం నిర్వహించగా జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భ ంగా అమృతవర్షిణి మ్యూజిక్ అకాడమీ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొనందుకు ఆనందగా ఉందన్నారు.కొత్తగూడెంలో అమృత వర్షిణి అకాడమీ ఏర్పాటు చేసి విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసి ప్రపంచానికి చాటుతున్న నిర్వహకుడు అలిపిరెడ్డి ఉదయ్ భాస్కర్ జిల్లా ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందులో భాగంగా 40మంది బాల,బాలికలకు, విద్యార్థులకు 81 స్వర అర్చన పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేసి అభినం దించారు. అదేవిధంగా విద్యార్థుల మేధోశక్తికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని గుర్తుచేశారు. అనంతరం అమృత వర్షిణి అకాడమీ నిర్వహకుడు ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ... ఈ సంకీర్తనలో భాగంగా 55వ దేవాలయంలో స్వామి సన్నిధిలో సంకీర్తన విజయవంతం చేసిన అమృత వర్షిణి మ్యూజిక్ అకాడమీ కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్ టౌన్ సీఐ కరుణాకర్,అమృత వర్షిణి అకాడమీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**

**చిట్టిరామవరం తండాలో డిజిటల్ భూ రీ సర్వే పనుల పరిశీలన**

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

కొత్తగూడెం మండలం చిట్టిరామవరం తండాలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను వినియోగిస్తూ చేపడుతున్న డిజిటల్ భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్, సర్వేలో అనుసరిస్తున్న విధానం, భూముల కొలతలు, వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అనంతరం స్థానిక రైతులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి భూ రీ సర్వేకు సంబంధించి వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూముల వివరాలు మరింత కచ్చితంగా నమోదు కావడంతో పాటు భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్ డాక్టర్ స్వప్న, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

**భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి**



# ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

**నిర్వాహకుల సమావేశంలో ఏసీపీ వసుందర యాదవ్**



సత్తుపల్లి సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న దృష్ట్యా నవ రాత్రులు పోలీస్ నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో సోదర భావంతో జరుపుకునే విధంగా నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ జరుపుకోవాలని కల్లూరు ఏసిపి వసుందర యాదవ్ ఐపిఎస్ గణేష్ నవరాత్రుల నిర్వహించే నిర్వాహకులకు ముందస్తుగా సలహాలు సూచనలు చేశారు. సత్తుపల్లి ఏసీపి కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకొని నవరాత్రులు నిర్వహిస్తున్న సంబంధిత నిర్వాహకులకు శుక్రవారం ఏసీ పి కార్యాలయంలో సమావేశం నిర్వహించి పోలీస్ నిబంధనలను మండపాలువద్ద పాటించాల్సిన సూచనలను ఏసిపి వివరించారు. గణేష్ నవరాత్రులు నిర్వహిస్తున్న మండపాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్ల వైరింగ్లు, నిపుణులతో తనిఖీ చేయించాలని, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని, మండపాలు వద్ద అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసి వేయకూడదని ఏసిపి స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తులు మహిళలు చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, పార్కింగ్, ట్రాఫిక్, నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని వసుంధర యాదవ్ సూచించారు. డీజే లు సౌండ్ సిస్టంలను వినియోగంలో ప్రభుత్వ నిబంధన లు తప్పనిసరిగా పాటించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని ఏసిపి నిర్వాహకులకు సూచించారు. మండపాలు వద్ద డీజే లకు అనుమతి లేదని రెండు మైక్‌లతో కూడిన స్పీకర్లు మాత్రమే అనుమతించబడతాయని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మైక్ సౌండ్ సిస్టం వినియోగించాలని ఆమె కోరారు. ప్రతి గణేష్ మండపంలో ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని, ప్రధాన రహదారులపై ట్రాఫిక్కు రద్దీగా ఉండే ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయొద్దని నిర్వహకులకు ఏసిపి వసుంధర యాదవ్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు అందరూ పోలీస్ శాఖ పోర్టల్లో రిజిస్టర్ అయ్యి మండపాలు వివరాలను ఆన్లైన్లోనమోదు చేసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ అంత రాయం కలగకుండా పోలీసులతో సమన్వయంచేసుకోవాలని నిర్ణయించిన మార్గాలు సమయాలను పాటించాలని ఈసందర్భంగా నిర్వాహకులకు ఏసిపి సూచించారు.ఈ సమావేశంలో సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్సై లు అశోక్ ,ప్రదీప్, మహిళా ఎస్ఐలు కవిత, హరిత పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ సర్వే త్వరగా పూర్తి చేయాలి.

**పాత రికార్డులు,మ్యాపుల ఆధారంగా భూ సరిహద్దుల కచ్చితమైన నిర్ధారణ**
**సీఎస్ఆర్ నిధులతో రహదారి నిర్మాణానికి చర్యలు: కలెక్టర్ అంకిత్**





అశ్వాపురం,ప్రభాతవార్త,సెప్టెంబర్ 11:

భూ రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి భూ సరిహద్దులను కచ్చితంగా నిర్ధారిస్తూ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రోవర్,ట్యాబ్ పరికరాల ద్వారా నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.డిజిటల్ విధానంలో సర్వే చేపట్టడం వల్ల సమయం,సిబ్బంది ఆదా కావడంతో పాటు ట్యాబ్‌లో నమోదైన సమాచారాన్ని నేరుగా కంప్యూటర్, ఆటోక్యాడ్‌లోకి మార్చుకునే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు.అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం పరిధిలో కాడస్ట్రల్ మ్యాపులు,పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుమారు 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.1920ల నాటి ఫసలీ రికార్డులతో పాటు అప్పటి బూర్గంపాడు తాలూకాకు సంబంధించిన పాత రికార్డులను కూడా పరిశీలిస్తున్నట్లు వివరించారు.మూడు తరాలుగా భూములను సాగు చేస్తూ అనుభవిస్తున్నప్పటికీ రికార్డుల్లో ఉపవిభజనలు నమోదు కాకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.గోదావరి వరదలు, భూమి కోతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పాత భూ సరిహద్దులు మారిపోయాయని అధికారులు వివరించారు.సీతారామ ప్రాజెక్టు పరిసరాల్లో కొన్ని ప్రాంతాల్లో సుమారు 250 మీటర్ల మేర భూ సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకున్నట్లు తెలిపారు. అలాగే 57/1 తదితర సర్వే నంబర్లలో నీట మునక,ఇసుక మేటల కారణంగా పాత భూ గుర్తులు కనుమరుగైనట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా సుమారు 7.91 కిలోమీటర్ల మేర సరిహద్దులను గుర్తిస్తున్నామని, రోజుకు సుమారు 2 కిలోమీటర్ల చొప్పున సర్వే నిర్వహించి 2 నుంచి 4 రోజుల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి రైతులకు వారి భూములపై స్పష్టత కల్పించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ప్రాంతంలో రహదారి నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు.దీనిపై స్పందించిన కలెక్టర్ అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్,సర్వే అధికారులు,సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి





మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్11:

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని మణుగూరు సీఐ పాటి నాగబాబు అన్నారు . ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి ఘర్షణలు లేదా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా సహించేది లేదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా విపరీత పరిణామాలు జరిగితే దానికి కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మండపాల వద్ద తగిన భద్రతా చర్యలు, జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్సైలు నగేష్ కుమార్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

అశ్వాపురం,ప్రభాతవా ర్తసెప్టెంబర్ 11:



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మండల స్థాయి సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేకాధికారి ఎస్ చందన సూచించారు.అశ్వాపురం మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఎంపీడీవో ముత్యాలరావు ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.చందన అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో ఆయా గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో 15 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ బాణోత్ సదర్‌లాల్ కోరారు.అలాగే చింత్రియాల, చింత్రియాల కాలనీ గ్రామ పంచాయతీలకు అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరారు.తుర్రంవారిగూడెం, ఎలకలగూడెం,గొందిగూడెం కొత్తూరు,మనుబోతులపాడు, బట్టీలగుంపు గ్రామపంచాయతీల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.సమావేశంలో ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఇంటికీ వీబీజీ రాంజీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా నీటి సంరక్షణకు అవకాశం ఉంటుందని తెలిపారు.అలాగే ఈ నెల 15వ తేదీతో చేయూత పెన్షన్లకు దరఖాస్తు గడువు ముగియ నున్నందున,అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మండల ప్రత్యేక అధికారి ఎస్.చందన మాట్లాడుతూ ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల స్థాయి సమీక్షా సమావేశాల ద్వారా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశాల్లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్‌లో ఉద్యోగుల నిరసన



మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) లోని కోల్, యాష్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)సీఈ బిచ్చన్నను ఉద్యోగులు నిర్బంధించారు. సీఈ కార్యాలయంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం జేఏసీ బీటీపీఎస్ కన్వీనర్ బి. రవిప్రసాద్ మాట్లాడుతూ... ప్రైవేటీకరణపై తమతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని గతంలో చెప్పిన యాజమాన్యం, ఇప్పుడు ఏకపక్షంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. టెండర్‌పై ఇప్పటికే జెన్‌కోలోని ఇద్దరు డైరెక్టర్లు సంతకాలు చేశారని, మరో ఉన్నతాధికారి సంతకం కూడా పూర్తయితే టెండర్ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ఈఏఈఏ నాయకులు డి. మహేష్, కార్మిక సంఘం1535 అధ్యక్షుడు వి. ప్రసాద్, కార్మిక సంఘం1104 ప్రధాన కార్యదర్శి బి. సత్యనారాయణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు శోభన్, క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ సిద్ధిలే హుస్సేన్, మహిళా ప్రతినిధి అల్తాఫా తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్యశాల సమస్యల పరిష్కారానికి చర్యలు

అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:

అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పశు వైద్యశాలను సర్పంచ్ బానోత్ సదర్ లాల్,ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశరావు సందర్శించారు. పశు వైద్యాధికారి ఎస్కే రూబీనా ఫర్హానాతో మాట్లాడి పశువులకు అందుతున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్,మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యశాలలో మోటార్ పనిచేయక తాగునీటి సమస్య ఏర్పడిందని, భవనానికి మరమ్మతులు, ప్రహరీ గోడ అవసరముందని వైద్యాధికారి తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను వారానికి రెండుసార్లు శుభ్రం చేయాలని కోరారు. దీనిపై సర్పంచ్ స్పందిస్తూ మోటార్ మరమ్మతు చేయించడంతో పాటు క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపడతామని హామీఇచ్చారు.భవన మరమ్మతులు,ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య అత్యంత కీలకం







మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్11:

మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్య మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య అత్యంత కీలకమైన మలుపు అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పరీక్షల ఉత్తీర్ణతకే పరిమితం కాకుండా ఉన్నత ఉద్యోగాలు, పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు. సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర శ్రమతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగల రని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు కమ్యూనికేషన్, కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ తల్లిదండ్రుల, కళాశాల పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్యలో వినాయక చవితి సంబరాలు

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:



మణుగూరు మండలం గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం వినాయక చవితి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ షాహీన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా విద్యార్థులు చిన్నతనం నుంచే అన్ని మతాలను గౌరవించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రాబోయే తరాల మేలు కోసం ప్రతీ ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ భాస్కర్ రెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జ్ నస్రీన్, పిపిటి ఇన్‌చార్జ్ వెంకటరమణతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎస్పీ బస్తీలో 247 మంది ఎస్ఐఆర్ నోటీసుదారుల విచారణ



**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

సీఎస్పీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం 22వ వార్డు 58, సీఎస్పీ బస్తీ 59వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ నిర్వహించారు. రెండు బూత్‌ల పరిధిలో మొత్తం 368 మందికి నోటీసులు జారీ చేయగా, 247 మంది విచారణకు హాజరై తమ వివరాలు అందించారు. అధికారులు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి డీఎల్ఓ సూపర్‌వైజర్లకు అందజేశారు. 58వ పోలింగ్ స్టేషన్ పరిధిలో 678 ఓట్లకు గాను మరణించిన, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన, డబుల్ ఓట్లను తొలగించిన అనంతరం 476 ఓట్లు మిగిలాయి. వీరిలో 105 మందికి ఎస్ఐఆర్ నోటీసులు జారీ కాగా, 82 మంది విచారణకు హాజరయ్యారు. 59వ పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,038 ఓట్లకు గాను డెత్, షిఫ్టెడ్, డబుల్ ఓట్లను తొలగించిన అనంతరం 845 ఓట్లు మిగిలాయి. ఇందులో 263 మందికి నోటీసులు ఇవ్వగా, 165 మంది హాజరై వివరణ ఇచ్చారు. నోటీసులు అందుకున్న నిరుపేద ఓటర్లు ఇబ్బందులు పడకుండా 22వ వార్డు కౌన్సిలర్ కొల్లపాటి శివకిరణ్, సీఎస్పీ బస్తీ సర్పంచ్ మోకాళ్ల లావణ్య కృష్ణప్రసాద్ అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన పత్రాలు సమకూర్చడంలో సహకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షర్మిలాబేగం, కె.శ్రీనివాస్, కృష్ణమూర్తి, యాకేష్, బీఎల్వోలు అరుణ, ధారలక్ష్మి, ఏ.పద్మావతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## 100 మందికి అన్నదానం

**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**



పట్టణంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాజన్ దివ్యాంగులు, వృద్ధుల మానవ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 100 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఇల్లందుకు చెందిన గంగుల భాస్కర్ రావు కుటుంబ సభ్యులు తమ వంతు సహాయంగా పేదలకు అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా సుమారు 100 మందికి సరిపడా వేడి అన్నం, సాంబార్‌ను తాజాగా తయారు చేసి ట్రస్ట్‌కు అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే ట్రస్ట్ ఫౌండర్, సభ్యులు స్పందించి ఆహారం వృథా కాకుండా పట్టణంలోని వివిధ కాలనీలకు వెళ్లారు. అక్కడ నివసిస్తున్న నిరుపేద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు స్వయంగా ఆహారం వడ్డించి ఆకలి తీర్చారు. లేట్ నైట్ అయినప్పటికీ సేవా కార్యక్రమానికి ఆటంకం కలగకుండా ట్రస్ట్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఇళ్లలో జరిగే శుభకార్యాలు, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర వేడుకలను సాజన్ ట్రస్ట్ ద్వారా అన్నదాన కార్యక్రమంగా నిర్వహించి, ఆకలితో ఉన్న పేదలకు ఒక పూట కడుపునిండా ఆహారం అందించాలని ట్రస్ట్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## మొక్కలే మనుగడకు మూలం..



**ఇల్లందు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని, మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇల్లందు పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే పచ్చదనం పెంపొందించడమే మార్గమని పేర్కొన్నారు. ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు.

## రైతులకు ఫార్మర్ ఐ.డి తప్పనిసరి




**టేకులపల్లి, ప్రభాతవార్త:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న వ్యవసాయ పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐ.డి (రైతు రిజిస్ట్రేషన్) చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అగ్రి స్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీలో భాగంగా ఈ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఫార్మర్ ఐడి వలన కలిగే లాభాలు, పీఎం కిసాన్ పథకం సహాయం పొందాలంటే ఫార్మర్ ఐడి తప్పనిసరి. బీమా, సబ్సిడీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు త్వరగా అందుతాయి. ఒకే ఐడితో లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాలోకి వస్తుంది. రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు అయి పారదర్శకత పెరుగుతుంది, మోసాలకు అడ్డుకట్ట పడుతుంది. ఆధార్ కార్డు నంబర్, భూమి పాస్ బుక్ వివరాలు, ఆధార్ కు లింక్ అయిన మొబైల్ నంబర్ ఎక్కడ నమోదు చేసుకోవాలి, రైతులు తమ దగ్గరలోని మీసేవ కేంద్రాల్లో కేవలం రూ. 15/ చెల్లించి నమోదు చేసుకోవచ్చు. అలాగే రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో ) ద్వారా ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏ ఈ ఓ.భాగ్యశ్రీ తెలిపారు




## మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం..



**.ఇల్లందు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**

గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతి కుటుంబ సభ్యులు మట్టి వినాయకుని పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని 23వ వార్డు ప్రత్యేక అధికారి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం 23వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తయారు చేయించిన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత జనరేషన్ లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రమాదకరమైన రసాయనలతో కూడిన రంగులతో తయారుచేయబడిన గణపతి విగ్రహాలను పూజలకు వినియోగిస్తున్నారని వీటి మూలాన నిమజ్జన సమయంలో ఈ విగ్రహాలు చెరువుల్లో వేయడం వలన నీరు కలుషితమై నీటిలో నివసించే జలచరాలు మృత్యువాత పడుతున్నాయని, ఈ నీటిని సేవించిన పశుపక్షాదులు సైతం అనారోగ్యానికి గురవుతున్నాయని దీని గుర్తించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వట్టి విగ్రహాలు ఒకటి రెండు రోజుల్లో నీటిలో కరిగిపోతాయని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తయారు చేయబడిన విగ్రహాలు నెలలు తరబడి నీటిలో నిలువ ఉంటాయని కొన్ని సందర్భాల్లో సంవత్సరాల తరబడి కరవకుండా నీటిలోనే ఉంటాయని దీని గుర్తించి మట్టితో తయారు చేసిన విగ్రహాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నరు. ఈ ప్రమాదాల అరికట్టేందుకే మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని ప్రతి ఒక్కరు మట్టి గణపతి లతో పూజలు నిర్వహించి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. అనంతరం 23వ వార్డు ఆర్పి అనంత నాగలక్ష్మి విగ్రహాలను అవార్డు ప్రజలకు పంపిణీ చేశారు.

## ఉన్నత చదువులే లక్ష్యంగా ముందుకు సాగాలి : సీఐ



**గుండాల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త**

విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని గుండాల సీఐ తిరుపతి ఎస్సై శ్రావణ్ కుమార్ అన్నారు. మండలం పరిధిలోని చిన్న వెంకటాపురం గ్రామ పరిధిలోని మల్లెలవారి గుంపు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు గుండాల సీఐ తిరుపతి ఆధ్వర్యంలో ఎస్సై శ్రావణ్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై పాఠశాల విద్యార్థులకు విద్యాభివృద్ధికి ప్రోత్సాహంగా బ్యాగులు, గొడుగులు పంపిణీ చేశారు. విద్యార్థుల ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమశిక్షణ తో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు.

## మృత కార్మికుల కుటుంబాలకు పీఆర్సీ చెల్లించాలి

**ఇల్లందు అర్బన్, ప్రభాతవార్త:**

విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు 2021 జూన్ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపల్ కమిషనర్ సందీప్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ పాషా మాట్లాడుతూ.. 2021 జూన్ పీఆర్సీ సమయంలో విధుల్లో ఉన్న కార్మికులు మృతిచెందినప్పటికీ, వారి కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించకపోగా పీఆర్సీ బకాయిలను కూడా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఇటీవల సమ్మె నోటీసులో పేర్కొన్న డిమాండ్లలో



భాగంగా నాలుగు నెలల పీఆర్సీ బకాయిలను 82 మంది కార్మికుల ఖాతాల్లో ఈ నెల 10న జమ చేశారని తెలిపారు. అయితే మృతిచెందిన తొమ్మిది మంది కార్మికుల కుటుంబాలకు మాత్రం పీఆర్సీ చెల్లించలేదన్నారు. రావర్తి ఎల్లయ్య, దేవులపల్లి మోహన్‌రావు, ముకుందం, సీహెచ్. సంపత్, మాతంగి కొమురయ్య, అక్కపాక శ్రీధర్, శివ తదితర మృత కార్మికులకు 2021 పీఆర్సీ సమయంలో మస్టర్లు ఉన్నప్పటికీ బకాయిలను జమ కాలేదని పేర్కొన్నారు. పశుల చంద్రమ్మ, రవీందర్ తదితరుల కుటుంబాలకు కూడా పీఆర్సీ చెల్లించాలని కోరారు. వినతిపత్రంపై కమిషనర్ సందీప్ సానుకూలంగా స్పందించి, అర్హత ఉన్న మృత కార్మికుల కుటుంబాలకు పీఆర్సీ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో యూనియన్ నాయకులు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మృత కార్మికుల కుటుంబ సభ్యులు రావర్తి భాగ్యమ్మ, పశుల చంద్రమ్మ, సీహెచ్. స్వరూప, అక్కపాక సుజాత, అరుణ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల వరుస సెలవులతో దమ్మపేటలో స్తంభించిన లావాదేవీలు!

**తీవ్ర ఇబ్బందుల్లో వినియోగదారులు**

**దమ్మపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకులు మూతపడటంతో దమ్మపేట మండల వినియోగదారులు, వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బ్యాంకింగ్ ఉద్యోగుల సమ్మె పిలుపుకు తోడు వరుసగా వారాంతపు సెలవులు రావడంతో బ్యాంకింగ్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా మండల వ్యాప్తంగా రోజువారీగా జరిగే రూ. కోట్ల ఆర్థిక లావాదేవీలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి. బ్యాంకులు మూతపడటం, ప్రధాన ఏటీఎంలలో నగదు అయిపోవడంతో ప్రజల కష్టాలు




రెట్టింపయ్యాయి. అత్యవసర వైద్య ఖర్చులు, నిత్యావసర కొనుగోళ్లు, వ్యాపార చెల్లింపుల కోసం డబ్బులు విత్‌డ్రా చేసుకుందామనుకున్న ఖాతాదారులకు నిరాశే ఎదురవుతోంది. పట్టణంలోని ఏటీఎం కేంద్రాల చుట్టూ తిరిగినా 'నో క్యాష్' బోర్డులే దర్శన మిస్తుండటంతో ప్రైవేట్ డిజిటల్ పేమెంట్ ఏజెంట్లు, మైక్రో ఏటీఎంలను ఆశ్రయించి అదనపు చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోంది. దమ్మపేట ప్రాంతంలో ప్రధానంగా పామాయిల్, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన చెక్కుల క్లియరెన్స్ నిలిచిపోవడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరుకులు కొనుగోలు చేసే వ్యాపారులకు నగదు రొటేషన్ కాక వ్యాపారాలు మందగించాయి. ముందస్తు వస్తున్న పండుగల నేపథ్యంలో వరుస సెలవుల సమయంలోనైనా ఏటీఎంలలో ఎప్పటికప్పుడు నగదు నింపేలా బ్యాంకింగ్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మండల ప్రజలు, వర్తక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.




## దమ్మపేటలో కామ్రేడ్ మల్లారెడ్డి సంస్మరణ సభ

**ప్రారంభమైన ఎఐకెఎస్ 36వ మహాసభల ప్రచారం**

**దమ్మపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**




అమరజీవి కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభను స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈక్రమంలో మల్లారెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇదే క్రమంలో నవంబర్‌లో నల్గొండలో జరిగే ఎఐకెఎస్ 36వ మహాసభలకు సంబంధించిన ప్రచారాన్ని 36 జెండాలు ఎగుర వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సారంపల్లి మల్లారెడ్డి ఒక విజ్ఞాన గని గొప్ప మేధావి, గొప్ప రైతు నాయకులు అని అన్నారు. ఉమ్మడి కమ్యూనిష్టు పార్టీ చీలికప్పుడు సిపిఎం పార్టీవైపు నిలబడి పార్టీ కోసం ఎనలేని కృషి చేసిన గొప్ప మార్క్సిస్టు మహానుభావుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, యండ్రాతి అప్పారావు, మొరంపూడి కేశవరావు, పిట్టల అర్జున్, సత్యనారాయణ, మురహరి రఘు, కొలికపోగు శ్రీనివాసరావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లలు స్వతంత్రంగా జీవించేలా తర్ఫీదు

**దమ్మపేటలో బుద్ధి మాంద్యుల తల్లిదండ్రుల నెలవారీ సమావేశం**

**దమ్మపేట, రూరల్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**



బుద్ధి మాంద్యత కలిగిన పిల్లలు రోజువారీ కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహించుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మదర్ థెరెస్సా మండల దివ్యాంగుల మనోవికాస ,పునరావాస సేవల కేంద్రం ప్రతినిధులు సూచించారు. శుక్రవారం దమ్మపేటలోని కేంద్రంలో బుద్ధి మాంద్యుల తల్లిదండ్రుల నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు తమ రోజువారీ అవసరాలను తామే నిర్వహించుకునేలా తర్ఫీదు ఇవ్వడంపై అవగాహన కల్పించారు. ప్రొఫెషనల్స్ తల్లిదండ్రుల పర్యవేక్షణలో పిల్లలకు వివిధ కార్యకలాపాలను స్వయంగా చేయించారు. ప్రతిరోజూ ఇంటి వద్ద కూడా ఇదే విధంగా సాధన చేయిస్తే పిల్లలు క్రమంగా స్వయం ఆధారితంగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. బుద్ధి మాంద్యత కలిగిన పిల్లలు ప్రతి చిన్న పనికి తల్లిదండ్రులపై ఆధారపడకుండా, తమకు సాధ్యమైన పనులను తామే చేసుకునేలా ప్రోత్సహించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. పిల్లల సామర్థ్యాలను గుర్తించి, వారికి అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ఈ సమావేశంలో దివ్యాంగుల కార్యక్రమాల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన టెక్నికల్ సపోర్ట్ ఏజెన్సీ (కిరణం) ఎన్‌జీవో ప్రతినిధి రమేష్, స్థానిక ఏపీఎం సంతోష్ కుమార్, సీ.సీ. సత్తిబాబు, ప్రొఫెషనల్స్ స్వాతి, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, యాక్టివిస్ట్, సీబీఆర్ వర్కర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన బుద్ధి మాంద్యుల తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యారు.

## మట్టి విగ్రహాల తయారీ

**దమ్మపేట రూరల్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**

స్థానిక పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు మట్టితో గణేష్ విగ్రహాల తయారీ పోటీ నిర్వహించడం జరిగింది. భక్తి భావాన్ని విద్యార్థుల్లో పెంపొందిస్తూ, పర్యావరణ రక్షణలో భాగంగా వినాయకుని మట్టి విగ్రహాలు తయారీ ఆవశ్యకతను ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి తెలియజేశారు. పోటీలో పాల్గొన్న జూనియర్, సీనియర్ విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. మట్టి విగ్రహాలను విద్యార్థులు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

**జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ**

**ఎస్ఈ మహేందర్**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించి జీరో యాక్సిడెంట్ లక్ష్యాన్ని సాధించేందుకు భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గొట్టిముక్కుల మహేందర్ తెలిపారు. విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తింగ్ వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు వదులుగా ఉన్న విద్యుత్ లైన్ల వద్ద 1,019 మిడిల్ పోల్స్, బలహీనంగా ఉన్న 470 స్తంభాలను మార్చినట్లు తెలిపారు. పశువులు, రైతులకు ప్రమాదాలు జరగకుండా 115 ట్రాన్స్‌ఫార్మర్ గద్దెల ఎత్తును పెంచినట్లు వెల్లడించారు. అలాగే 1,160 ప్రాంతాల్లో ఎర్తింగ్ వ్యవస్థలను సరిచేయడంతో పాటు, ఫీడర్లలో ఇండక్షన్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న 113 ప్రాంతాల్లో సాంకేతిక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు వైపుల నుంచి విద్యుత్ సరఫరా జరిగే ప్రాంతాల్లో డేంజర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్‌లతో స్థానికంగా లైన్ క్లియర్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు, నిరంతర తనిఖీలు, సిబ్బందికి భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు. ప్రజలు విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, తెగిపోయిన విద్యుత్ వైర్లు కనిపిస్తే తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. వినియోగదారులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జీరో యాక్సిడెంట్ లక్ష్యం సాధించే వరకు చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ప్రకృతి సేవకులను అభినందించిన శివస్వామి

**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



భద్రాచలంలో మూడు రోజులుగా నిర్వహించిన పారంపర్య రాష్ట్ర 3వ మహాసభలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైవక్షేత్ర వ్యవస్థాపక పీఠాధిపతులు, ఋషిరత్న బిరుదాంకితులు శ్రీశ్రీశ్రీ శివస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి సేవ చేస్తున్న మొక్కల వెంకటయ్య, మొక్కల కె.ఎన్. రాజశేఖర్ (మన్ కీ బాత్), సింగరేణియన్, నైనిక రజువా, ఎండి. ఆఫాన్ జైదీలను శివస్వామి ప్రత్యేకంగా అభినందించి ఆశీర్వదించారు. ప్రకృతి హరిత దీక్షకులు నైనిక రజువా స్వామీజీకి మొక్కను అందజేశారు. మహాసభలలో 500 రకాల ఔషధ మొక్కలను ఏర్పాటు చేసి ఉచితంగా పంపిణీ చేసిన మొక్కల వెంకటయ్యను స్వామీజీ అభినందించారు. ప్రతిభ కనబరిచిన వారికి స్వామీజీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ట్రెడిషనల్ డీలర్స్ ట్రైనింగ్ వర్క్‌షాప్, మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ సర్టిఫికెట్లను కూడా అందించారు. కార్యక్రమంలో మల్లికార్జున స్వామీజీ, కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర రాజు, సజ్జన రమేష్, దొంతు యాత్రి మహార్షి, బండి వెంకటేశ్వర్లు, ఎం.డి. జమాల్ ఖాన్, రామంచి శ్రీనివాస్, భాను ప్రసాద్, దుర్గారాణి, అరుణ, వీరభద్రాచారి, రామకృష్ణ, వాహేదలి, బొబ్బిలి మోహన్, పద్మారావు, సిహెచ్. రవీందర్, రాచూరి రాజు, జి. సుగుణారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.10.50 లక్షలకు చికెన్ వ్యర్థాల సేకరణ కాంట్రాక్ట్ ఖరారు

**అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని చికెన్ షాపుల వ్యర్థాల సేకరణ కాంట్రాక్ట్ బహిరంగ వేలం పాట శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ ఆక్షన్ ప్రక్రియలో కురిశెట్టి నాగబాబు నాయుడు రూ.10.50 లక్షలకు గాను అత్యధిక పాట పాడి వ్యర్థాల సేకరణ హక్కులను సొంతం చేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిబంధనల ప్రకారం నిర్వహించిన ఈ వేలం పాట ముగిసిన అనంతరం, కాంట్రాక్ట్‌కు సంబంధించిన అధికారిక ఆర్డర్ పత్రాలను మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ చేతుల మీదుగా నాగబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ పట్టణ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచడం, దుర్వాసన మరియు వ్యాధులు ప్రబలకుండా చూడడమే లక్ష్యంగా ఈ వ్యర్థాల సేకరణ కాంట్రాక్ట్‌ను కేటాయించినట్లు తెలిపారు. పట్టణంలోని చికెన్ షాపుల నిర్వాహకులు, నాన్‌వెజ్ వ్యాపారులు తమ వద్ద చేరే వ్యర్థాలను రోడ్లపై గానీ, మురుగు కాలువలలో గానీ వేయకుండా నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ సేకరించే వాహనాలకే అప్పగించి మున్సిపాలిటీ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు






# కార్మికుల హక్కుల కోసం అగ్రిమెంట్లు సాధిస్తాం

**సాధించిన హక్కులు కార్మికులకు అందే వరకు పోరాడుతాం**

**సత్తుపల్లి జేవిఆర్ ఓసీ గేట్ మీటింగ్ లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి**

సత్తుపల్లి సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాటానికి మరో కీలక విజయం లభించిందని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సాధించిన విజయాలను కార్మికులకు వివరించేందుకు సత్తుపల్లి జే వి ఆర్ ఓ సి లో గేట్ మీటింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూసింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై యాజమాన్యంతో ఆర్ఎల్సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని తెలిపారు .ఏఐటీయూసీ నిరంతర ఒత్తిడి,పోరాటం ఫలితంగా గురువారం జరిగిన కీలక చర్చల్లో సింగరేణి యాజమాన్యం కార్మికుల పలు ప్రధాన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి అనేక అంశాలపై అగ్రిమెంట్లకుఅంగీకరించిందని తెలిపారు.s ార్మికులకు ప్రయోజనం చేకూర్చే కీలక డిమాండ్లపై అగ్రిమెంట్ చేయడంజరిగిందని, ప్రధానంగా పెర్క్స్ పై విధించే ఇన్కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించే విధంగాఅగ్రిమెంట్, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి ..20 లక్షల ఆర్థిక సహాయం, కార్మికుల వైద్య సమస్యల పరిష్కారానికి ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహణ,2025-26 వాస్తవ లాభాల



ప్రకటన, ట్రాన్స్‌ఫర్లలో ఉన్న మూడు సంవత్సరాల నిబంధనకు మార్పు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు వంటి కీలక అంశాలపై యాజమాన్యంసానుకూలంగా స్పందించిందని తెలిపారు.అదేవిధంగా హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, సుమారు 22 సంవత్సరాలుగా మారని మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సింగరేణి విద్యాసంస్థల్లో సి బి ఎస్ ఈ సిలబస్ అమలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఎస్ ఐ వైద్య సదుపాయం, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసుల పరిష్కారం, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం, మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్లు జారీ వంటి పలు డిమాండ్లపై కూడా అగ్రిమెంట్లు జరిగాయని సీతారామయ్యతెలిపారు.సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ చురుకుగా పాల్గొని, ఆ బొగ్గు బ్లాకులు సింగరేణికే దక్కేలా అన్ని విధాలా కృషి చేయాలని కోరారు.కొత్త గనులురాకపోతే భవిష్యత్తులో సింగరేణి ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, కార్మికుల భవిష్యత్ ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందని సీతారామయ్య ఆందోళన వ్యక్తం చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే పలు కీలకఅంశాలపైఅంగీకారాలు సాధ్యమయ్యాయని నాయకులుతెలిపారు .పెర్క్స్ పై ఇన్కమ్ ట్యాక్స్, సొంత ఇంటి పథకం, ..20 లక్షల ఆర్థిక సహాయం, మెడికల్ బోర్డు, లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ నిబంధనలు, ప్రమోషన్లు, వైద్య సదుపాయాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర కీలక డిమాండ్లపై జరిగిన అగ్రిమెంట్లు కార్మికుల పోరాటానికి లభించిన విజయాలని నాయకులు పేర్కొన్నారు.సత్తుపల్లి లో పలు సమస్యలపై మాట్లాడుతూ ముఖ్యంగా ఈపీ ఆపరేటర్ల సమ్మె నేపథ్యంలో సత్తుపల్లి జే వి ఆర్ లో ఓ సి లో నాలుగు మాస్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఒకటి ఫిబ్రవరి2026న ప్లే డే విధులకు సాధారణ అర్హత లేకపోయినప్పటికీ, యాజమాన్యం ప్రత్యేక నోటు జారీ చేసి 61 మంది ఈపీ ఆపరేటర్లతో విధులు నిర్వహింపజేసిందని తెలిపారు. వారికి కచ్చితంగా ప్లే డే జీత భత్యాలు యాజమాన్యంతో మాట్లాడి ఇప్పిస్తామని తెలిపారు.కొత్తగూడెం ఏరియాలో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని,అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్ కన్వర్షన్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.కార్మికుల సీనియారిటీ, అర్హతలను పరిగణనలోకి తీసుకుని కన్వర్షన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్,డి బీమయ్య,పి సూర్య ప్రకాష్, ఆర్ భరణి, టీ ఉపేంద్ర చారి, ప్రసాద్,బి సుధాకర్, బి భద్రు, జి బాల సుబ్రహ్మణ్యం, భారత్ శ్రీను, రాంబాబు, భాస్కర్ లాల్, అశోక్,పి నరేందర్, సమంత్,బి బన్ను, యాకోబ్, వి వినయ్ కుమార్, క్రాంతి కుమార్,శ్రీకాంత్, మహేష్, రాజేష్, రవి, సురేష్,ఎమ్ రాజు, రంగా చారి,దానియల్ సిపిఐ పార్టీ అది నారాయణ, యోబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు ఈనెల 30 వరకు పొడిగింపు....

సత్తుపల్లి సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



సత్తుపల్లిజెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 202627 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల నిమిత్తం గడువు తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించడం జరిగిందని కోఆర్డినేటర్ డా. దీపు పూర్ణచంద్రరావు శుక్రవారంఒక ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్, డిప్లొమా పాసైన విద్యార్థులు అర్హులని ఆయన అన్నారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదవాలనుకునే ఎస్.టి కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ విద్యార్థులకు ఉచిత డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్డిగ్రీచేయలేనివారు ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్యలో పొందిన డిగ్రీకి రెగ్యులర్ విద్యలో పొందిన డిగ్రీతో సమానమైన అవకాశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు సెప్టెంబర్ 30 లోపు చెల్లించాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

## పాత్రికేయుడిని పరామర్శించిన తోటి పాత్రికేయులు

కల్లూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో గల పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు కాకిత రామారావు ఇటీవల కాలికి శస్త్ర చికిత్స వల్ల హైదరాబాదు ఓ ప్రైవేటు హాస్పిటల్లో శస్త్ర చికిత్స చేయడం జరిగింది. అందులో బాగంగా శస్త్ర చికిత్స అనంతరం తిరిగి హైదరాబాదు నుండి తన సొంత గ్రామం అయిన పుల్లయ్య బంజరు రావడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న కల్లూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయ మిత్రులు రామారావు నివాస గృహానికి వెళ్లి రామారావును పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పాత్రికేయ మిత్రులు వేము రాంబాబు, దాసరి దేవిడ్, రాథోడ్ శ్రీనివాసరావు, కావేటి రాధాకృష్ణ, చెవుల నరేష్, కోటా పుల్లయ్య, వినుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు

## ఎంఈఓ ను విధుల నుంచి తొలగించాలి

కల్లూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

కల్లూరు ఎంఈఓ పొదిలి పద్మను విధులను తొలగించాలని యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు, మండల నాయకులు మాట్లాడుతూ సబ్జెక్టులు వారీగా అవసరాలు ఉపాధ్యాయ నిష్పత్తిని పరిగణలోకి తీసుకోకుండా చేపట్టిన వర్క్ అడ్జస్ట్మెంట్ వల్ల పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ఎంఈఓ ఏకపక్ష నిర్ణయాల వల్ల మండలంలోని పలు పాఠశాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలపై ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ కు సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అవసరమైతే దశలవారు ఆందోళనలు చేపడతామని యుటిఎఫ్ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కార్యదర్శి కే విజయ్ కుమార్, మండల అధ్యక్షులు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి ఎర్రం అప్పారావు లతోపాటు ఉపాధ్యాయులతో మెరుపు ధర్నా నిర్వహించారు.




## గణేష్ ఉత్సవాలపై మండలాధికారులతో సమీక్ష

పెనుబల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



పెనుబల్లి మండల వ్యాప్తంగా జరగనున్న గణేష్ ఉత్సవాల నిర్వహణపై తహశీల్దార్ వీరభద్ర నాయక్ మండల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పెనుబల్లి మండలం లోని గ్రామపంచాయతీల లో విగ్రహాలు ఏర్పాటు నుండి నిమజ్జనం జరిగే సమయం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, విద్యుత్, నీటిపారుదల, పోలీస్, గ్రామపంచాయతీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పెద్ద పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నిమజ్జనానికి విగ్రహాలు తరలించే సమయంలో విద్యుత్ తీగలు, నిమజ్జన ప్రదేశాలను సంబంధిత శాఖ అధికారులు పూర్తి పర్యవేక్షణ అవసరమన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పోటాపోటీగా నిర్వహిస్తున్న గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వ్యక్తులను ముందస్తుగా గుర్తించడం ద్వారా అక్కడ శాంతియుతంగా ఉత్సవాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు . నిమజ్జన ప్రదేశాల్లో విగ్రహం వెంట ఈత వచ్చిన వ్యక్తులు మాత్రమే అనుమతించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత వరకు డీజే సౌండ్ సిస్టం అదుపు చేసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని, మందిరాలు, మసీదులు, చర్చిలు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద సౌండ్ సిస్టం అదుపులో ఉండాలని సూచించారు. వినాయక చవితి వేడుకలను ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మండల ప్రజానీకాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్సై షాకీర్, ఎంపీడీవో, నీటిపారుదల విద్యుత్ శాఖ ఏ ఇ రవితేజ అధికారులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

కల్లూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం గం. 800 లకు ఉప్పల్ భగాయత్ లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయాల చారిత్రాత్మక నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం, శ్రీనివాస కళ్యాణం జరుగుతుంది.తదనంతరం ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయుచున్నారు. కావున ఈ సమావేశానికి మన ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య బంధు మిత్రులందరూ తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతాచంద్రరావు కోరారు. ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, మండల కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాలు యువజన సంఘం, మహిళా సంఘం, సేవాదళ్, రాజకీయ విభాగం, విద్యా కమిటీల సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కార్యక్రమానికి తరలిరావాలని పసుమర్తి సీతా చంద్రరావు కోరారు.

# కోనాయిగూడెం, ఆరెగూడెం గ్రామాల మధ్య గల బ్రిడ్జిని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**

కోనాయిగూడెంఆరెగూడెం గ్రామాల మధ్య నందిగామ బ్రాంచి కెనాల్ పై ప్రత్యామ్నయం రహదారిని వెంటనే చూపాలని నేలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మేకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రహదారి లేక ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించేందుకు బ్రిడ్జిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మేకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు నత్తనడకగా వలన ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. వంతెన నిర్మాణంలో ఉన్నందున్న కాలువ లోనే రాకపోకలకు ప్రత్యేకంగా రహదారిని ఏర్పాటు చేశారన్నారు. కానీ ప్రస్తుతం తాగునీటి సౌకర్యం



కోసం కాలువలో అడ్డంగా వేసిన రహదారి మటిని తొలగించారని దాని వలన రాకపోకలకు ప్రత్యామ్నయం చూపకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెం గ్రామాల కు చెందిన ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కనీసం మూడు కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తుందని, రైతులు నిత్యం వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లాల్సి వస్తుందని రైతులకు సాయంత్రం, రాత్రి వేళలలో ఇబ్బందిగా మారుతుందన్నారు. ఇప్పటికే నాలుగు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఇటు అధికారులు కానీ అటు కాంట్రాక్టర్ కానీ పట్టించుకోకపోవటం దారుణం అన్నారు. కనీసం పెద్ద పైపులు వేసి వెంటనే ప్రత్యామ్నయం రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనం వెంకటరెడ్డి, చెరుకుపల్లి రాజేష్, వడ్డమూడి వెంకటేశ్వర్లు, మేకల అర్జున్, కర్ల ఆశోక్, బోయిన కొండలు, పుల్లోజి రాకేష్, కొత్తపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యం

### కలెక్టర్ చోరవతో రూ.1.80 లక్షలు మంజూరు

### జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి రాజశేఖర్ గౌడ్

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కే.రాజశేఖర్ గౌడ్ వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంను ఆయనఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఓపీ రోగుల వద్దకు వెళ్లి వైద్య



సేవలు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్ ను పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ గౌడ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ హస్పిటల్స్ లో కార్పోరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నేలకొండపల్లి సిహెచ్సీ కి రోగుల సంఖ్య ఎక్కువగా వస్తున్న విషయంను అవసరమైన మందులు గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ ప్రత్యేక చోరవతో రూ.1.80 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. నేలకొండపల్లి సిహెచ్సీ 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ గా చేసే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద కు చేరిందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చోరవతో త్వరగా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగళ, డాక్టర్ కే.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉపేందర్

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా భైరవునిపల్లి గ్రామానికి చెంది న మల్లెబోయిన ఉపేందర్ ఎన్నికైనారు. గురువారం యాదగిరిగుట్టలో జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో మల్లెబోయిన ఉపేందర్‌ను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ స్థాయి నుంచి యువజన ఉద్యమంలో చురుకుగా పని చేస్తూ మండల, జిల్లా స్థాయిలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లెబోయిన ఉపేందర్‌కు రాష్ట్ర కమిటీలో చోటు దక్కడం నేలకొండపల్లి మండల యువజన ఉద్యమానికి దక్కిన గౌరవంగా పలువురు నాయకులు భావిస్తున్నారు. యువజనుల సమస్యల పై నిరంతరం పోరాడుతూ ఏఐవైఎఫ్‌ను క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. మల్లెబోయి నఉపేందర్ ఎన్నిక పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్, కనకబండి సీతారాములు, నేలకొండపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, పలువురు సీపీఐ నాయకులు, ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంను పొందండి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారంను ప్రతీ ఒక్కరూ పొందాలని కోరట్లగూడెం అంగన్వాడీ టీచర్ బచ్చలకూరి నిర్మల వెల్లడించారు. జాతీయ పోషకాహార మాసోత్స వం సందర్భంగా శుక్రవారం కోరుట్లగూడెం గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో వివిధ రకాల పోషకాహారం వంటలను ప్రదర్శించారు. ఈసందర్భంగా అంగన్వాడి టీచర్ నిర్మల మాట్లాడుతూ కేంద్రంలో అందించే పౌష్టికాహారం గర్భిణీలకు. బాలింతలకు, చిన్నారుల ఆరోగ్యం శ్రీరామరక్ష అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చూస్తే భయం

### ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తారనే సస్పెన్షన్

### ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్‌కుమార్

**అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:**



తెలంగాణలో అధికార పార్టీ అరాచక పాలన సాగిస్తోందని పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్‌కుమార్ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడంతో పాటు,ఒక నెపంతో ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయించారని విమర్శించారు. అసెంబ్లీలో ఉంటే కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతోనే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు.నిజంగా ప్రభుత్వానికి ధైర్యం ఉంటే ఆరు గ్యారెంటీలు,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు.దళితుల సంక్షేమం గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం దళిత నాయకత్వానికి ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి,ప్రజలను మభ్యపెట్టకుండా పాలన సాగించాలని వెన్న అశోక్‌కుమార్ సూచించారు.

## చేతిపంపుల మరమ్మతులు పూర్తి



**ఒఅశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:**

గొందిగూడెం గ్రామంలోని మరమ్మతులకు గురైన చేతిపంపులను సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి చొరవతో మరమ్మత్తు చేయించారు.చేతిపంపులు పనిచేయక ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ వెంటనే సిబ్బందిని పిలిపించి అవసరమైన సామగ్రిని సమకూర్చి మరమ్మతులు పూర్తి చేయించారు. కొత్త పైపులు, ఇతర అవసరమైన సామగ్రిని కూడా ఏర్పాటు చేయించారు.గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని సర్పంచ్ తెలిపారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లిపాడు సెంటర్లో రోడ్డు ప్రమాదం..

**కొణిజర్ల, సెప్టెంబర్ 11ప్రభాత వార్త:**

మండల పరిధిలో పల్లిపాడు, ఏన్కూర్ కూడలి సెంటర్లో శుక్రవారం సాయంత్రం సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాద ఘటనలో స్థానిక సింగరాయపాలెం సర్పంచి వేము నాగరాజుతో పాటు , ఖమ్మం ,బుర్హాన్ పురం గ్రామానికి చెందిన నగేష్ , తోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్ వారు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక సింగరాయపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ వేము నాగరాజు ఖమ్మం వైపు నుండి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో పల్లిపాడు ఏనుకూరు కూడలి వద్దకు రాగానే.. వైరా వైపు నుండి నుంచి ఖమ్మం వైపుకు ఇద్దరు వ్యక్తులు మరో ద్విచక్ర వాహనంపై వస్తు ఎదురుగా వస్తున్న సర్పంచ్ బైక్ను బలంగా ఢీకొట్టడంతో. సర్పంచ్ నాగరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన హెల్మెట్ ధరించినప్పటికీ ప్రమాద తీవ్రతకు హెల్మెట్ పగిలిపోయినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన బైక్ నడుపుతున్న వ్యక్తికి , వెనుక కూర్చున్న మరోకరికి కూడా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక





ఎస్ఐ సూరజ్ తెలిపారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భద్రాచలంలో బంగారు షాపులపై..

# బీఐఎస్ కొరడా!

**హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ నిబంధనలపై ఆకస్మిక తనిఖీలు**

**522 గ్రాముల బంగారం సీజ్..**

**173 ఆభరణాలు స్వాధీనం**

**శ్రీ వెంకటరత్నా, శ్రీదేవి జ్యువెలరీలపై కేసుల నమోదు**

**తనిఖీల వేళ భద్రాచలంలో పలు షాపులకు షట్టర్లు**







**భద్రాచలం, ప్రభాతవార్త:**

భద్రాచలంలో బంగారు ఆభరణాల విక్రయాలపై భారతీయ ప్రమాణాల సంస్థ అధికారులు కొరడా ఝుళిపించారు. హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ, లైసెన్సుల నిబంధనల అమలును పరిశీలించేందుకు శుక్రవారం పట్టణంలోని రెండు బంగారు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీ వెంకటరత్న జ్యువెలరీ, శ్రీదేవి జ్యువెలరీల్లో తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

తనిఖీల సందర్భంగా అధికారులు ఆభరణాలపై ఉన్న హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ వివరాలతో పాటు హాల్ మార్కింగ్‌కు సంబంధించిన లైసెన్సులు, ఇతర రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా లేని ఆభరణాలను గుర్తించి సుమారు 522 గ్రాముల బంగారాన్ని సీజ్ చేసి, 173ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కొన్ని ఆభర ణాల పై ఉన్న మార్కింగ్‌లను అనుమానాస్పదంగా గుర్తించి వాటి నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు తెలుస్తోంది.

**నెల క్రితమే హెచ్చరిక**

బంగారు వ్యాపారులకు బీఐఎస్ అధికారులు సుమారు నెలరోజుల క్రితమే అవగాహన కల్పించినట్లు సమాచారం. భద్రాచలంలోని తాతగూడెం ప్రాంతంలోని సమావేశ మందిరంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బంగారు షాపుల యజమానులతో సమావేశం నిర్వహించి, హాల్‌మార్కింగ్, హెచ్‌యూఐడీకు సంబం ధించిన నిబంధనలు, లైసెన్సుల ప్రాధాన్య తపై అధికారులు వివరించినట్లు తెలిసిం ది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అప్పుడే హెచ్చరించినట్లు సమాచారం.




**తనిఖీల వేళ షాపులకు షట్టర్లు**

అయితే శుక్రవారం రెండు దుకాణాల్లో బీఐఎస్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలియడంతో భద్రాచలంలోని సుమారు 15 బంగారు దుకాణాలు మూసివేసి అందు బాటులో లేకుండా పోయినట్లు సమాచారం. ఈ పరిణా మం పట్టణంలో చర్చనీ యాంశంగా మారింది. జిల్లా లోని ఇతర ప్రాంతాల్లోని కొందరు బంగారు వ్యాపా రులు సైతం షాపులు మూసి వేసినట్లు సమాచారం. ఈ పరిస్థితులపై అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

**వినియోగదారుల్లో**



**సందేహాలు**

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండటంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుం చి ప్రజలు ఇక్కడికి వచ్చి బంగారు ఆభరణాలు కొను గోలు చేస్తుంటారు. హాల్ మార్క్ నిబంధనలపై పూర్తి అవగాహన లేకపోవడంతో చాలామంది వ్యాపారులపై నమ్మకంతోనే కొనుగోళ్లు చేస్తున్న పరిస్థితి ఉంది. తాజా బీఐఎస్ తనిఖీల నేపథ్యంలో తమ వద్ద ఉన్న ఆభరణాల హాల్‌మార్క్, హెచ్ యూఐడీ వివరాలను పరిశీలిం చుకునేం దుకు కొందరు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

**హెచ్‌యూఐడీను పరిశీలించాలి**

బంగారం కొనుగోలు చేసే సమయంలో కేవలం హాల్ మార్క్ గుర్తును చూసి సరిపెట్టుకోకుండా హెచ్‌యూఐడీ వివరాలను కూడా ధృవీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నట్లు తెలిసింది. ఆభరణం నాణ్య త, హాల్ మార్క్, హెచ్‌యూఐడీ వివరా లను పరిశీలించిన తర్వా తే కొను గోలు చేయాలని స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

**పరీక్షల తర్వాతే స్పష్టత**

సీజ్ చేసిన ఆభరణాల్లో కొన్ని నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు తెలుస్తోంది. పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాత వాటిలో నిబం ధనలకు విరుద్ధమైన మార్కింగ్‌లు లేదా ఇతర లోపాలు ఉన్నాయా? అన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. లైసెన్సు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపా రం నిర్వహించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం జరిమా నాలు, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. భద్రా చలంలో జరిగిన ఈ ఆకస్మిక తనిఖీలతో బంగారు వ్యాపార వర్గాల్లో కలకలం మొదలైంది. తాజాగా రెండు షాపుల్లో నమోదైన కేసులు, సీజ్ చేసిన బంగారం, స్వాధీనం చేసు కున్న ఆభరణాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఇదే తరహాలో జిల్లాలోని ఇతర బంగారు దుకాణాల్లోనూ తనిఖీలు కొనసాగుతా యా అన్న చర్చ ప్రస్తుతం వ్యాపార వర్గాల్లో నెలకొంది.

---

## గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకారించాలి

**శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్**

**ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త**

వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని



వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అదేవిదంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షి తంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ భానుప్రకాష్ పాల్గొన్నారు.

---

## ఆదివాసీ వలస గ్రామాల సంక్షేమానికి పోలీసు శాఖ కృషి

**కందిపాడు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్**

**డీఎస్పీ అరుణ్ కుమార్**

**చర్ల, సెప్టెంబర్ 11(ప్రభాతవార్త)**

వలస ఆదివాసీల గ్రామాల ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కృషిచేస్తుందని డిఎస్పీ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం కందిపాడులో పోలీస్ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారీకి పాల్పడవద్దని సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాలు మరియు వినియోగం వల్ల కుటుంబాలపై, ముఖ్యంగా యువతపై పడే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. అక్రమ గుడుంబా తయారీ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామంలోని యువత, పిల్లలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తూ గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం, మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందనే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు వర్మ ఎస్సైలు నర్సిరెడ్డి కేశవ్ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## పింజరమడుగులో పశువైద్య శిబిరం విజయవంతం



**కామేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**

పశువుల ఆరోగ్య పరిరక్షణ, సంతానోత్పత్తి మెరుగుదల లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామం లో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ వ్యాధులను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. పశువులకు సమతుల్య పోషకాహారం తో పాటు ఖనిజ లవణాలు అందించాలని సూచించారు. ఎద లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అలాగే సెక్స్ సార్టెడ్ సీమెన్ వినియోగంతో ఆడ దూడల జనన అవకాశాలను పెంచుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరాన్ని ఖమ్మం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ కిషోర్ సందర్శించి పశువైద్య సేవలను పరిశీలించారు. రైతులకు అందుతున్న సేవలు, సంతానోత్పత్తి కార్యక్రమాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు, గోపాలమిత్ర సూపర్వైజర్ వెంకటేష్, వీఎల్ఓ వెంకటేశ్వర్లు, గోపాల మిత్రులు ధర్మ, నాగు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెప్టెన్ బంజర పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, షూస్ పంపిణీ



**కామేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సౌకర్యాల్లో భాగంగా సరఫరా చేసిన షూస్, సాక్సులు, యూనిఫామ్ ను సర్పంచ్ అరేం అచ్చమ్మ చేతుల మీదుగా శుక్రవారం కామేపల్లి మండలం కెప్టెన్ బంజర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యా యులు బానోత్ బావ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ అచ్చమ్మ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం విద్యతో పాటు అవసరమైన అనేక సౌకర్యాలను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ సౌకర్యాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫామ్‌లు, షూస్, సాక్సులు తదితర సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో, శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ అరేం అచ్చమ్మ విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు బానోత్ బావ్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలలకు అవసరమైన అనేక సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిరోజూ పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనను సద్వినియోగం చేసుకొని విద్యలో ముందుండాలని హితబోధ చేశారు. "ప్రభుత్వం అందించే ప్రతి సౌకర్యం మీ చదువుకు తోడ్పాటుగా నిలుస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి అని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్.

**గిరిజన భూముల పరాయీకరణపై పరిశోధనకు డాక్టరేట్.**

**సాధారణ రైతు కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు ప్రయాణం.**

**పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 11.**

మండల తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్ విద్యారంగంలో అరుదైన ఘనతను సాధించారు. గిరిజన భూముల పరాయీకరణ, ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనుల భూముల పరిస్థితులపై విశేష పరిశోధన చేసిన ఆయనకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజకీయ శాస్త్ర విభాగంలో ఆయన చేపట్టిన పరిశోధనకు ఈ గౌరవం దక్కింది. రమేష్ అత్యంత సాధారణ రైతు కుటుంబం. తల్లిదండ్రులు మంగమ్మ, ధర్మయ్య. చిన్నతనంలోనే తండ్రి ధర్మయ్య మరణించడంతో కుటుంబ బాధ్యతలు తల్లి మంగమ్మపై పడ్డాయి. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ తల్లి తన పిల్లలను చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చిన్ననాటి నుంచే దగ్గరగా చూసిన రమేష్ వారి శ్రమను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి పనిచేయడం, పట్టుదలతో ముందుకు సాగడం నేర్చుకున్నారు. తన విద్యాభ్యాసంలో తాత అందించిన సహకారం సైతం ఎంతో ఉందని రమేష్ తెలిపారు. రమేష్ పాఠశాల విద్యను పూర్తిగా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలోనే కొనసాగించారు. ఏడో తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. అనంతరం ఖమ్మం జిల్లాలోని ఏపీఆర్‌జేసీ కృష్ణసాగర్, బూర్గంపాడు ప్రాంతంలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారు. భద్రాచలంలో డిగ్రీ విద్యను అభ్యసించారు. ఉన్నత విద్యపై ఆసక్తితో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రతిష్టాత్మక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర విద్యను పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో పరిశోధన చేసేందుకు 2018లో బహిరంగ విభాగంలో ప్రవేశం పొందారు. రమేష్ తన పరిశోధన కోసం "ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన భూముల పరాయీకరణ – భద్రాచలం ఐటీడీఏపై ఒక అధ్యయనం" అనే అంశాన్ని ఎంచుకున్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనుల భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లే పరిస్థితులు, గిరిజనుల భూ హక్కులు, భూముల పరాయీకరణకు దారితీస్తున్న కారణాలు తదితర అంశాలను ఆయన తన పరిశోధనలో లోతుగా అధ్యయనం చేశారు. దీర్ఘకాలం పాటు కొనసాగిన పరిశోధన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 10న తన పరిశోధనా సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన సీనియర్ ఆచార్యులు జాడి ముసలయ్య ఆయనకు పరిశోధనా మార్గదర్శకులుగా వ్యవహరించారు. రమేష్ కుటుంబంలోనూ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆయన తమ్ముడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జంతుశాస్త్ర విభాగంలో ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. మరో తమ్ముడు సర్వేయర్‌గా



విధులు నిర్వహిస్తున్నారు. చెల్లెలు ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసి పాఠశాల సహాయకురాలిగా గణిత బోధనలో సేవలందిస్తున్నారు. కుటుంబ సభ్యులంతా తమ తమ రంగాల్లో ఉద్యోగాల్లో స్థిరపడటం పట్ల రమేష్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా విద్యపై దృష్టి సారించిన రమేష్ ఐటీడీఏ పాఠశాల నుంచి తన విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించి కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు సాగించారు. చివరకు డాక్టరేట్ సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. పేదరికం, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రమేష్ విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది ఆయన సాధించిన ఈ ఘనత పినపాక ప్రాంత ప్రజలు, సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, మిత్రులకు గర్వకారణంగా నిలిచింది.

# పాఠశాలకు బెంచీల అందజేత

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:**

నెల్లిపాక గ్రామపంచాయతీ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐటీసీ సంస్థ సహకారంతో బెంచీలను అందజేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు బెంచీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో కూడా నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, అలాగే గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు ఐటీసీ సంస్థ సహకారం అందించిందని వారు తెలిపారు. పాఠశాలలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటీసీ డీజీఎం డి. చెంగల్‌రావు, మేనేజర్ బి. విశ్వనాథంలను గ్రామ పెద్దలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఐటీసీ సంస్థ ముందుకు రావడం పట్ల వారు కృతజ్ఞతలు



తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు అమరపురి శివానంద, ఏఎంసీ సభ్యులు కర్రి భువన సంతోష్, మాజీ సర్పంచ్ గొర్రెముచ్చు వెంకటరమణ, గ్రామపంచాయతీ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ మాసం

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:**

తుర్రంవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తురుమలగూడెం తండా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ తార హాజరై పోషణ మాసం ప్రాధాన్యతను వివరించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తమ ఆరోగ్యంతో పాటు శిశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్లు స్వప్న, ధనలక్ష్మి, సావిత్రి మాట్లాడుతూ పోషణ మాసం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, బరువు, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కుంజా జాను, ఉపసర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ హాజరై ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి చిన్నారుల పోషణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. పోషకాహార



లోపం వల్ల ఎదురయ్యే సమస్యలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోషణ మాసం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ద్వారా ఆరోగ్య వంతమైన భవిష్యత్ తరాలను తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండలానికి చెందిన పలువురు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## కనులపండువగా లక్ష పుష్పార్చన..

**నార్కట్పల్లి ప్రభాతవార్త సెప్టెంబర్ 11**

చెర్వుగట్టు అమావాస్యతో పాటు చివరి శ్రావణమాస శుక్రవారం కావడంతో చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష పుష్పార్చనను దర్శించుకున్న భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచి, తమ కుటుంబాలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.

# మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలి

వైరా టౌన్ సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త)



గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని వైరా ఎస్సై పుష్పాల రామారావు సూచించారు. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు, నిమజ్జన కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైరా పట్టణంలోని కామిశెట్టి కళ్యాణ మండపంలో వైరా మున్సిపాలిటీ, మండల పరిధిలోని గణేష్ మండపాల ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుతంగా జరిగేలా ప్రతి మండపం నిర్వాహకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. మండపాల వద్ద రద్దీ పెరిగే సమయాల్లో నిర్వాహకులు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిమజ్జనంలో మరింత జాగ్రగణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు, యువత మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు. నిమజ్జనానికి వెళ్లే వాహనాల్లో పరిమితికి మించి వ్యక్తులను ఎక్కించరాదని, వాహనాలపై ప్రమాదకరంగా నిలబడటం, వేలాడటం చేయవద్దని తెలిపారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనల మేరకు ముందుకు సాగాలని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల్లో రద్దీని నియంత్రించేందుకు పోలీసులకు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. చెరువులు, నీటి వనరుల వద్దకు చిన్నారులను ఒంటరిగా పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈత రాని వారు లోతైన నీటిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనడం, వాహనాలు నడపడం పూర్తిగా నివారించాలని తెలిపారు. శాంతిభద్రతలకు ప్రాధాన్యంఉత్సవాల సందర్భంగా ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావులేకుండా అన్ని మండపాల నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరించాలని ఎస్సై కోరారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు, లౌడ్‌స్పీకర్లు వినియోగించకుండా ప్రభుత్వం, పోలీసుల నిబంధనలను పాటించాలని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, వివాదాస్పద పోస్టులు, వదంతులను ప్రచారం చేయవద్దని హెచ్చరించారు. ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తే గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించవచ్చని ఎస్సై పుష్పాల రామారావు పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో పాటు వైరా మున్సిపాలిటీ, మండల పరిధిలోని వివిధ గణేష్ మండపాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పురుగుమందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ఏన్కూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



:పురుగుమందులను సిఫారసు చేసిన మోతాదులోనే వినియోగిస్తూ..ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడు కోవాలని కేవీకే శాస్త్రవేత్తలు పావణి..పణిశ్రీ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో వ్య వసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో "పురుగుమం దులు..మానవాళిపై ప్రభావం"అనే అం శంపై రెండు రోజుల రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా కేవీకే శాస్త్రవేత్తలు పావణి..వ ణిశ్రీ మాట్లాడుతూ.. పంటల్లో చీడపీడల నివారణకు పురుగుమందుల వినియోగం అవసరమైనప్పటికీ..వాటిని విచక్షణారహితంగా ఉపయోగించడం వల్ల రైతుల ఆరోగ్యంతో పాటు పంటలు...నేల..నీరు.. పర్యావరణంపై ప్రతి కూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. పురుగుమందులను అవసరమైనప్పుడు మాత్రమే..వ్యవసా యశాఖ నిపుణులు సూచించిన మేరకు వినియోగించాలని సూచించారు. సురక్షిత వినియోగంపై ప్రత్యేక అవగాహన..పురుగుమందులను పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలు(పీపీఈ) వినియో గించాలని తెలిపారు. మందులు కలిపే సమయంలో చేతులకు గ్లౌజులు..ముఖానికి మాస్క్..కళ్లకు రక్షణ కళ్లద్దాలు, శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని సూచించారు. పిచికారీ అనంతరం చేతులు...ముఖం..శరీరాన్ని శుభ్రం గా కడుక్కోవాలని..పురుగుమందుల డబ్బాలను ఇతర అవసరాలకు వినియోగించరాదని వివరించారు. అలాగే పు రుగుమందుల సీసాలు..ఖాళీ డబ్బాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా.. సురక్షిత పద్ధతిలో పారవేయాలని సూచించారు. ఒకేసారి అధిక మోతాదులో మందులు వినియోగించడం వల్ల చీడపీడలపై ప్రభావం తగ్గడమే కాకుం డా..పంట ఉత్పత్తుల్లో అవశేషాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా వినియోగదారుల ఆరోగ్యానికి కూడా ముప్పు కలిగే అవకాశం ఉందన్నారు. లేబుల్ సూచనలు తప్పనిసరిగా పాటించాలి..పురుగుమందుల కొనుగోలు సమయంలో లేబుల్‌పై ఉన్న వివరాలను పరిశీలించాలని..పంటకు సిఫారసు చేసిన మందును మాత్రమే ఎంచుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మందుల మోతాదు కలిపే విధానం, పిచికారీ సమ యం..కోతకు ముందు పాటించాల్సిన గడువు వంటి సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతులు శాస్త్ర వేత్తలు.. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకుని సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ వాసిరెడ్డి సత్యనారాయణ, భగవాన్ నాయక్ తండా సర్పంచ్ మణి, బా బు,మండల వ్యవసాయ అధికారి అవుకు నరసింహారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోతు లచ్చి రామ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆత్మ సిబ్బంది, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రీప్రైమరీ విద్యపై తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ సూచనలు

వైరా టౌన్ సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త)

ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో ప్రీప్రైమరీ సెక్షన్లను ఏర్పాటు చేసి, 2+, 3+, 4+ వయస్సు గల చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోంది. అలాగే ప్రత్యేక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్/ఆయాలను కూడా నియమించడం జరిగింది. కావున వైరా పట్టణం మరియు మండల పరిధిలోని తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలు లేదా ప్రీప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాము. అదేవిధంగా, అనుమతులు లేకుండా "ప్లే స్కూల్/ప్రీప్రైమరీ" పేరుతో నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థల్లో పిల్లల భద్రతకు, రక్షణకు తగిన భరోసా ఉండదనే విషయం తల్లిదండ్రులు గమనించాలి. చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, గుర్తింపు మరియు అనుమతులు ఉన్న ప్రభుత్వ, ప్రీప్రైమరీ కేంద్రాల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతున్నాము. అనుమతులు లేకుండా ఎవరూ ప్రీప్రైమరీ సెక్షన్లు/ప్రీప్రైమరీ కేంద్రాలు నిర్వహించరాదు. అటువంటి నిర్వహణ నిబంధనలకు విరుద్ధమని మండల విద్యాశాఖాధికారి చావా శ్రీనివాసరావు తెలియజేసారు.

# అటవీ అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



వైరా టౌన్ సెప్టెంబర్ 11 (ప్రభాత వార్త)

ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న హైదరాబాద్‌లో నిర్వహించిన "అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం" కార్యక్రమంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర వన్యప్రాణి బోర్డు సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొని అటవీ సంరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ. అటవీ సంపద, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి ప్రాణత్యాగం చేసిన అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగస్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అలాగే ఇటీవల సింగరేణి మండలానికి చెందిన నవీన్ నాయక్ మృతి చెందిన విషయం తనను తీవ్రంగా కలచివేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆకాంక్షించారు. అటవీ సంరక్షణలో అహర్నిశలు సేవలందిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలను ఎమ్మెల్యే అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు పచ్చని తెలంగాణను అందించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పర్యావరణ రక్షణే మానవాళి రక్షణ



వైరా టౌన్ సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త)

పర్యావరణ రక్షిస్తేనే మానవాళి రక్షణ ఉంటుందని స్థానిక వైరా పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి నవీన జ్యోతి తెలిపారు. స్థానిక కళాశాల లో పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పై అవగాహన కొరకు పర్యావరణ హితమట్టి వినాయకులు తయారీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలు సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మనవెంత సాంకేతిక అభివృద్ధి చెందినప్పటికీ పర్యావరణానికి ముప్పు జరిగితే మానవాళి జీవితాలకు నష్టం జరుగుతుందని తెలుపుతూ. ఈ మధ్యకాలంలో నేపాల్ లో జరిగిన వరదలకు కారణం పర్యావరణం ముప్పు వలన ఈ అకారణ వరదలు వచ్చాయని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ, ప్రజల పర్యావరణ కాపాడటానికి చేయాల్సిన చర్యలు తెలపవలసిందిగా కోరారు. అనంతరం విద్యార్థులు స్వయంగా మట్టితో వినాయకులు తయారు చేసే పోటీ నిర్వహించగా, ఆ పోటీల్లో మొదటి బహుమతి ఏ ప్రశాంతి వై చరిత్ర శ్రీ, ద్వితీయ బహుమతి బి మృదుల, నైటింగేల్, అఖిల శ్రీ, తృతీయ బహుమతి సిహెచ్ జై దుర్గ, ఎం అమృత, కన్సిలేషన్ బహుమతి ఎస్.కె మైమున ఎస్కె సాహిన, గెలుపొందడం జరిగింది. వీరికి బహుమతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పర్యావరణ కమిటీ అధ్యక్షులు బోటనీ లెక్చరర్ సుధాకర్, కమిటీ సభ్యులు సివిక్స్ లెక్చరర్ డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, ఒకేషనల్ లెక్చరర్ ఎం.వి, కెమిస్ట్రీ లెక్చరర్ కవిత, కామర్స్ లెక్చరర్ ఎన్ఎస్ఎస్పిఓ. కంచర్ల శ్రీకాంత్, స్టూడెంట్ కౌన్సిలర్ అర్థశాస్త్ర అధ్యాపకురాలు స్వప్న విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తిపై తెల్ల దోమ దాడి..అప్రమత్తంగా ఉండాలి !

**పత్తి రైతు..పురుగులపై నిఘా పెట్టు !**

**పత్తిలో పురుగుల బెడద..నివారణే ముద్దు !**

**చీడపీడలపై సమరమే..పంటకు రక్షణే !**

**ఏన్కూరు,సెప్టెంబర్ 11, ప్రభాత వార్త:**





మండల కేంద్రమైన ఏన్కూరు గ్రామ సమీపంలోని పత్తి చేను..మిరప తోటను వైరా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్ర వేత్తలు పావణి..పణిశ్రీ శుక్రవారం సందర్శించి పరిశీలించారు.పత్తి పంటలో చీడపీడల ఉధృతి..మొక్కల ఎదుగుద ల పంట పరిస్థితిని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పావణి..పణిశ్రీ మా ట్లా డుతూ..పత్తిలో రసం పీల్చే పురుగులు..ముఖ్యంగా తెల్ల దోమ పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.పురుగుల ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ..అవసరాన్ని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాల ని సూచించారు.రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ మందును సిఫారసు చేసిన మోతాదులో విని యోగించాలని..పంటకు నష్టం కలిగించే ఇతర పురుగుల నియంత్రణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిం చాలని తెలిపారు.అదే విధంగా పత్తి..మిరప చేలల్లో పసుపు..నీలం రంగు అట్టలను ఏర్పాటు చేసుకో వడం ద్వారా తెల్లదోమ..తామర పురుగుల ఉనికిని గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపట్టవచ్చని రైతులకు వివరించారు.ర సాయన మందులపై పూర్తిగా ఆధారపడకుండా సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతో పాటు పంట నాణ్యతను..దిగుబడిని కాపాడుకోవచ్చని సూచించారు.పంటలో పురుగుల ఉధృతిని బట్టి సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు.అవసరం లేకుం డా పురుగు మందులను పిచికారి చేయకుండా..నిపుణుల సలహాలతో సరియైన మందును..సరియైన మోతాదు లో వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.రైతులు విచక్షణారహితంగా పిచికారీ చేయకుండా..పురుగు ఉ ధృతిని గుర్తించిన అనంతరం వ్యవసాయ శాఖ అధికారుల సలహా మేరకు తగిన మందులను..సరైన మోతాదులో వినియోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు.పంటల పరిశీలనను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రారంభ దశలోనే చీడపీడలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.పంటలను తరచుగా పరిశీలించడం..కలుపు మొక్క లను తొలగించడం..పురుగుల ఉద్రితిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా..పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని శా స్త్రవేత్తలు తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ శాస్త్రీయ పద్ధతులను పా టించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవుకు నరసింహారావు,వ్యవసాయ విస్త రణ అధికారులు సైదులు,నవ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ఫాగింగ్

**కామేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**



కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం దోమల నివారణకు శుక్రవారం ఫాగింగ్ ముమ్మరంగా నిర్వహించారు.సర్పంచ్ మాలోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో వర్షాకాలం దృష్ట్యా ఈ ముందస్తు చర్యలు చేపట్టారు.ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అంటరానితనం పోయింది

**మమ్మల్ని అవమానించవద్దు.**

**బి ఆర్ ఎస్, బిజెపి దళిత వ్యతిరేకుల పార్టీలు.**

**జడ్పీ సెంటర్ లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం.**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**.ఖమ్మం టౌన్ సెప్టెంబర్ 11: (ప్రభాతవార్త**







)జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ప్రసంగించిన ప్రదేశంలోను, ఎర్రవల్లిలో పసుపు నీటితో శుద్ధి చేయడం, మరియు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తల్లిని దూషించటం శోచనీయమని బీ ఆర్ ఎస్, బీ జె పి పార్టీల దళిత వ్యతిరేక చర్యలను ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిం చనైనది. ఈ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ అంటరానితనం సమాజంలో ఎప్పుడూ కనుమరుగైందని ఇప్పుడు మమ్మల్ని అవమానించవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగం డ్ల దీపక్ చౌదరి, మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, పట్టాభి,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొంద య్య, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ కుమార్ మరియు, జిల్లా నాయకులు, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, ప్రస్తుత మాజి ప్రజా ప్రతినిధులు ,శ్రేణులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్ పి సెంటర్ నందు గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు బీ ఆర్ ఎస్, బీ జె పి పార్టీల దళిత వ్యతిరేక చర్యలను ఖండిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహంనకు పాలాభిషేకం నిర్వహించనైనది.

## విద్యార్థులకు యూనిఫామ్, షూస్ పంపిణీ



**కామేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని హరిచంద్రపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ అజ్మీ ర ద్వాలి, ఉప సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, వార్డు సభ్యురాలు ఏ.పద్మ ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్, షూస్ ను పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు.ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నందున వినియోగించుకోవాల్సి న అవసరం విద్యార్థుల పైన ఎంతైనా ఉందన్నారు.నాణ్యమైన విద్యా బోధన, మెరుగైన సదుపాయాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తుండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు డి.ఇందిర, ఎస్ కే ఆశా సుల్తానా, గ్రామ పెద్దలు గుగులోత్ రాందాస్, బి. నరేష్, భాగం రంగారావు, అజ్మీర చిన్న తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంటలతో సాగు లాభసాటి

**కామేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :**



వ్యవసాయం లో వర్షపు నీటిని సంరక్షించి,సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జలసిరి పథకం ద్వారా అందిస్తున్న నీటికుంటలు (ఫామ్ పాండ్) రైతులకు ఎంతో ఉపయోగకరమని కామేపల్లి ఎంపీడీవో ధరావత్ సోంలాల్ అన్నారు.ఈ మేరకు రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పని కూలీలకు పనిదినాలు కల్పిస్తూ.. ఏర్పాటు చేస్తున్న నీటి కుంటల పథకానికి ఐదు ఎకరాలలోపు రైతులు అర్హులని, ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీవో అద్దంకి శ్రీరాణి, ఏ వో బి.తారా దేవి, పి ఆర్ ఏ ఈ వేములపల్లి కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి బాగు చేయమంటే అధ్వానంగా మార్చారు

**కారేపల్లి సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిన చందంలా రహదారి అధ్వానంగా ఉంది బాగు చేయండి అని కాలనీవాసులు అడిగితే రహదారిపై మరం కుప్పలు పోసి దారిలో మట్టి దిబ్బలు వేసిచేతులు దులుపుకున్న వైనం సింగరేణి మండలం గాంధీపురం డబల్ బెడ్ రూమ్ కాలనీలో చోటుచేసుకుంది. కాలనీలో అంతర్గత రహదారులు పరిస్థితి అధ్వానంగా ఉండి బురదమయంగా మారుతున్నాయి. దీంతో కాలనీ వాసులు దారి బాగు చేయాలని పంచాయతీ కార్యదర్శినికోరారు. దారి బాగు కోసం ట్రాక్టర్ తో మట్టిని దిబ్బలా పోసి వదిలివేశారు. ఆ దారివెంట వాహనాలే కాక నడవటానికి సైతం ఇబ్బందులు పడుతున్నట్లుకాలనీ వాసి గోసుల పుల్లారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గ్రామపంచాయతీ కార్యదర్శికి చెప్పిన పట్టించుకోవటం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా దారిపై పోసిన మట్టిని చదును చేసి రాక పోకలకు ఇబ్బందులులేకుండా చూడాలనిలేదంటే ఉన్నతాధికారులను పిర్యాదు చేయటం తప్ప వేరే దారి లేదని కాలనీవాసులు అంటున్నారు.

## 13న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

**జిల్లా ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు**

జూలూరుపాడు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 11:



హైదరాబాదులోని ఉప్పల్, భగాయత్ లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణం కోసం భూమి పూజ, వెంకటేశ్వర స్వామి కళ్యాణం, ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 13న జరగనున్నట్లు జిల్లా ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జనరల్ సెక్రెటరీ కొదుమూరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉప్పల్, భగాయత్ లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పలు శాఖ మంత్రులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఆర్యవైశ్యుల చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లాలోని ఆర్యవైశ్యులందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వైద్య సుగుణారావు కు ఘన సన్మానం

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



పారంపర్య వైద్య రంగంలో ప్రకృతి వైద్యం తోపాటు, ఆల్టర్నేటివ్ థెరపిస్ట్ గా విశిష్ట సేవలు అందిస్తున్న వైద్య జి. సుగుణారావుకు ప్రతిష్టాత్మక ఋషివైద్య ఉత్తమ సేవాపురస్కారంకి అవార్డు లభించింది. భద్రాచలంలో నిర్వహించిన పారంపర్య వైద్య మహాసంఘం (పీవీఎంఎస్) తెలంగాణ 3వ మహాసభలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించి, సన్మానించారు. గురువారం రాత్రి మూడో రోజు ముగింపు సందర్భంగా, మహాసభలో యోగ గురువు, భారత ధర్మ దేవత బ్రహ్మచారి, శైవ క్షేత్ర పీఠాధిపతులు, శ్రీ శ్రీ శ్రీ శివ స్వామీజీ, పారంపర్య వైద్య మహాసభ అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి, ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు, మహర్షి గోశాల వ్యవస్థాపకులు సజ్జన రమేష్, పుత్తూరు చంద్రశేఖర రాజు, ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, కోశాధికారి దుర్గారాణి, వైద్యశ్రీ జమాల్ ఖాన్ ల చేతులమీదుగా వైద్య సుగుణారావు అవార్డును అందుకున్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

**బిజెపి అధ్యక్షులు శ్రీనివాస చారి**

ఆళ్లపల్లి 11 సెప్టెంబర్ ప్రభాతవార్త:



తెలంగాణ విమోచన దిన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మండల బిజెపి అధ్యక్షులు తాటకొండ శ్రీనివాస చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బిజెపి నాయకులతో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డిటి బాదావత్ బద్రు నాయక్ కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు విమోచన చరిత్రను తెలియాలని తెలియజేయాలని సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం అనధికారికంగా కాకుండా అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని ఆనాటి కాలంలో నిజాం నిరంకుశ పాలన నుండి మన తెలంగాణ ప్రజలు విముక్తి చెందిన రోజు అని ఆ రోజునే విమోచన దినోత్సవం గా ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని అలా అధికారికంగా నిర్వహించిన రోజే ఆ విమోచన దినోత్సవ చరిత్రను ఈ కాలంలో ఉన్నటువంటి ప్రజలకు యువతకు అవగాహన కలుగుతుందని ఆనాటి అమరవీరుల త్యాగాలవలనే నిజాం నిరంకుశ పాలన వైదొలిగిన రోజు సెప్టెంబర్ 17న అని ఆ రోజునా విమోచన దినోత్సవం గా అధికారికంగా నిర్వహిస్తే భవిష్యత్తు తరాలకు అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ వారి చరిత్రను గుర్తు చేసుకుంటూ ముందు తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఈ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని ఆనాటి నిజాం నిరంకుశ పాలన తరిమి తరిమి కొట్టిన అమరవీరుల త్యాగాలను చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కమిటీ సభ్యులు చిరునోముల వజ్రం, పూణెం రాంబాబు, పడిగె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# అడవుల కోసం ప్రాణాలర్పించిన అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**అమరుల స్ఫూర్తితో అటవీ వన్యప్రాణి సంరక్షణ చర్యలకు మరింత బలోపేతం చేస్తాం**

**చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి కే తేజస్వీ**

చంద్రుగొండ ప్రభాతవార్త



అడవుల కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎంతో మంది అటవీ అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి కే తేజస్వీ అన్నారు. అటవీ అమరవీరుల సంస్కరణ దినోత్సవం పురస్కరించుకొని చంద్రగొండ మండలం బెండాలపాడు గ్రామ శివారు ఎర్రబోడు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలమల శ్రీనివాసరావు స్మృతి వనంలో శుక్రవారం అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చలమల శ్రీనివాసరావు స్మారక స్తూపం పై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ తేజస్వి మాట్లాడుతూ..... అడవులు వన్యప్రాణులు జీవవైవిధ్యం సహజ వనరులు పర్యావరణ సంయుక్తల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి ప్రాణ త్యాగం చేసిన అటవీ అధికారి చలమల శ్రీనివాస రావు ను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. అటవీ ప్రాంతాల్లో అటవీ సిబ్బంది గా విధులు నిర్వహించడం, ప్రకృతి సంపదకు కాపలాదారులుగా, సమాజానికి సహజ భద్రతను అందించే బాధ్యతాయుతమైన సేవ అని ఆమె పేర్కొన్నారు. తమ వ్యక్తిగత భద్రత కంటే అడవుల భద్రత, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల భౌగాలిక భద్రత, భూముల భద్రత, ప్రకృతి పరిరక్షణ, భవిష్యత్తు తరాలకు సహజ జీవన భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కృషి చేస్తూ తమ ప్రాణాలను అర్పించిన ప్రతి అటవీ అమరవీరుని త్యాగం దేశ పకృతి సంపదకు చేసిన అపారమైన సేవగా చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె లక్ష్మీ మృపతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో 50 నిరుపేద కుటుంబాలకు తోపుడు బండ్ల పంపిణీ

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



సఫా బైతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 50 నిరుపేద కుటుంబాలకు ఉపాధి కోసం తోపుడు బండ్లు, కూరగాయలు, సామగ్రిని పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు సఫా బైతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో 50 తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఉపాధి పొందేందుకు వీలుగా లబ్దిదారులకు తోపుడు బండ్లతో పాటు కూరగాయలు, పండ్లు, ప్లాస్టిక్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... నిరుపేద కుటుంబాలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ది చెందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తోపుడు బండ్ల ద్వారా కూరగాయలు, పండ్లు, ప్లాస్టిక్ సామగ్రి విక్రయించుకుంటూ కుటుంబాలను పోషించుకునే అవకాశం లబ్దిదారులకు కల్పించినట్లు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సఫా బైతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని జమియతే ఉలమా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మోలానా అబ్దుల్ కరీమ్ అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించి పేద ప్రజలకు అండగా నిలవాలని ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు. నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించేలా తోపుడు బండ్లను అందజేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కొత్తగూడెం ప్రజలు ఫౌండేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

## బీట్ ఆఫీసర్ కేసులో నలుగురు రిమాండ్

కొత్తగూడెం లీగల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

కొత్తగూడెం మొదటి అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ (ఎఫ్ఏసీ) రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవికుమార్ నలుగురు ముద్దాయిలకు రిమాండ్ విధించారు. పాల్వంచ రేంజి మునలిమడుగు బీట్ లో వన్యప్రాణులను కాపాడబోయి భానోతు నవీన్ అక్రమంగా వన్యప్రాణులకు వేటాడుటకు అక్రమంగా ఎలక్ట్రికల్ వైరు పెట్టినందున, వన్యప్రాణులను కాపాడబోయిన బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ చనిపోయిన కేసులో, వన్యాప్రానుల సంరక్షణ చట్ట ప్రకారం పాల్వంచ రేంజ్ స్టేషన్ లో నమోదైన కేసు లో నలుగురు లక్ష్మీపురం కు చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబు !!వీరయ్య, నాగినేని ప్రోలు రెడ్డిపాలెం కు చెందిన కన్నెదారి అనంతయ్య !!అంతయ్య లు భద్రాచలం సబ్ జైల్ లో బూర్గంపాడు పోలీస్ స్టేషన్ వారు పోలీసు వారు పెట్టిన కేసు నందు రిమాండ్ లో ఉండగా ప్రొడక్షన్ వారంట్ తో ఈరోజు వర్చువల్ ద్వారా రిమాండు విధిస్తూ ఈ నెల 25కు వాయిదా వేశారు. పాల్వంచ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సురేష్, డిప్యూటీ రేంజర్ కే. అన్నార్కలి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కల్పనలు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా జేసీబీతో చెట్లు తొలగింపు

**పోలీసులకు రైతు ఫిర్యాదు**

పాల్వంచ, సెప్టెంబర్ 11, ప్రభాత వార్త:

పాల్వంచ మండలంలోని పాండురంగాపురం గ్రామంలో తన వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి జేసీబీతో చెట్లు పీకి భూమిని చదును చేశారని ఆరోపిస్తూ ఓ రైతు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు సోమా వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, పాండురంగాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 126/56లో తనకు 10 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. శుక్రవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లగా, భూమిలో ఉన్న చెట్లను జేసీబీతో పీకి భూమిని చదును చేసినట్లు గుర్తించానని తెలిపారు. ఈ విషయమై సమీప పొలాల యజమానులను అడగగా, రెండు రోజుల క్రితం గంగిరెడ్డి ఆదిలక్ష్మి, గంగిరెడ్డి సరిత, పిల్లి రఘురామిరెడ్డి అనే ముగ్గురు వ్యక్తులు జేసీబీతో వచ్చి చెట్లు తొలగించినట్లు వారు తెలిపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన అనుమతి లేకుండా భూమిలోకి ప్రవేశించి చెట్లను తొలగించడం వల్ల సుమారు రూ. 90 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని వెంకటరెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పాల్వంచ రూరల్ పోలీసులను కోరుతూ ఫిర్యాదు చేశారు.

## అప్పు తీర్చమన్నందుకు దాడి, బెదిరింపులు

**- తండ్రీకొడుకులపై పోలీసులకు ఫిర్యాదు**

పాల్వంచ, సెప్టెంబర్ 11, ప్రభాత వార్త:

అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరిన వ్యక్తిపై దాడి చేసి, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడ్డారంటూ ఇద్దరిపై పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు మద్దిశెట్టి సాయిబాబు (44) తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని రాహుల్ గాంధీ నగర్‌కు చెందిన ఆయన బోర్‌వెల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి–సోములగూడెం గ్రామంలో భారతీయ పెట్రోలియం ఇంధన కేంద్రం ఎదురుగా ఉన్న ఆయన బోర్‌వెల్ కార్యాలయం పక్కనే ఆహార విక్రయ కేంద్రం నిర్వహిస్తున్న మడిపల్లి అనిల్ కుమార్ కుటుంబ అవసరాల నిమిత్తం గతంలో విడతల వారీగా రూ. 5 లక్షలు అప్పుగా తీసుకున్నాడని తెలిపారు. అప్పుగా తీసుకున్న నగదు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా అనిల్ కుమార్ దాటవేస్తూ రావడంతో న్యాయస్థానంలో వ్యక్తిగత వ్యాజ్యం దాఖలు చేసినట్లు సాయిబాబు పేర్కొన్నారు. ఈ విషయంపై మనస్తాపానికి గురైన అనిల్ కుమార్ శుక్రవారం సాయంత్రం సుమారు 4.20 గంటల సమయంలో చేతిలో బీరు సీసాతో కార్యాలయంలోకి వచ్చి, "నాపై కేసు వేస్తావా.. నీకు డబ్బులు ఇవ్వను.. ఏం చేస్తావో చేసుకో" అంటూ దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం అనిల్ కుమార్ తండ్రి వెంకటేశ్వర్లు కూడా అక్కడికి చేరుకుని, ఇద్దరూ కలిసి కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి తనను తోసివేసి, చంపేస్తామని బెదిరించారని తెలిపారు. అలాగే కార్యాలయంలో ఉన్న సుమారు రూ. 2 వేల విలువైన ప్లాస్టిక్ కుర్చీలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. తన కార్యాలయంలోకి అక్రమంగా చొరబడి దాడి చేయడంతో పాటు ప్రాణహాని బెదిరింపులకు పాల్పడిన అనిల్ కుమార్, వెంకటేశ్వర్లుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ఉప నిరీక్షకుడికి బాధితుడు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

## అక్టోబర్ 4న రెడ్‌క్రాస్ ఎన్నికలు

కొత్తగూడెం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభాగం ఎన్నికలు అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఎన్నికల ప్రత్యేక అధికారిణిగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిణి (సీపీఓ) సునీతను నియమించారు. జిల్లాలో 2,563 మంది సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. ఈ నెల 14న ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచనుండగా, 15లోపు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 19న తుది ఓటర్ల జాబితాతో పాటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఒక్కో నామినేషన్‌కు రూ.10 వేల నాన్‌రిఫండబుల్ డిపాజిట్ చెల్లించాలి. 25న నామినేషన్ల పరిశీలన, 26న ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అక్టోబర్ 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

### జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో నిర్వహించిన సంస్మరణ సభకు ఆయన హాజరయ్యారు. చలమల శ్రీనివాసరావు విగ్రహానికి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటవీ నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. అటవీ సంపదను కాపాడటంతో పాటు గిరిజనుల హక్కులను పరిరక్షిించేందుకు అటవీశాఖ, గిరిజన సమాజాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రుద్రంపూర్ ఫిల్టర్‌బెడ్ వద్ద ప్రమాదాల పరంపర

రుద్రంపూర్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

రుద్రంపూర్ ఫిల్టర్‌బెడ్ వద్ద మూలమలుపు ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మరో ప్రమాదం తృటిలో తప్పింది. అదుపుతప్పిన వాహనం చెట్టును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవర్ క్షేమంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో మూలమలుపు స్పష్టంగా కనిపించకపోవడం, రహదారి పరిస్థితులు తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న సింగరేణి జనరల్ మేనేజర్ సీహెచ్.వెంకటరమణ, ఎస్వో డీజీఎం గోవిందరావు ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదాలకు కారణాలను పరిశీలించి నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



## మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 11)



దుమ్ముగూడెం మండల పరిధిలోని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయికార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో వివేక్ రామ్ దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య ఎంఈఓ సున్నం సమ్మయ్య హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు అలాగే కొత్తపల్లి సర్పంచ్ కోర్స దుర్గా నారాయణరావుపేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ రామచంద్రునిపేట సర్పంచ్ కంగాల నాగయ్య ఆదివాసీ సీనియర్ నాయకులు ముర్రం వీరభద్రం పాల్గొని విద్యార్థులను అభినందించారుఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి ఎంతో ముఖ్యమని గ్రామీణ స్థాయి నుండి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడమే ఈ ఆటల పోటీల ముఖ్య ఉద్దేశమని తెలిపారు ఈ ఆటల పోటీలలో స్కూల్ పీఈటీ పీడీలు బట్ట హరికృష్ణ కుంజా వెంకటేష్ సోయం జయ కారం సర్వేశ్వరరావు దొర మడకం మోతీర్ వివిధ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 11)



దుమ్ముగూడెం మండలంలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఇంటర్నెట్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని డిసిసి మీడియా కమ్యూనికేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోఆర్డినేటర్ దుమ్ముగూడెం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కనుబుద్ది దేవ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబును కలిసి విజ్ఞప్తి చేశారు జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి చాలువతో సన్మానించారు అనంతరం ఆయన దృష్టికి దుమ్ముగూడెం మండలంలో నెలకొని ఉన్న గ్రంథాలయ సమస్యలను తీసుకువెళ్లారుఈ సందర్భంగా దుమ్ముగూడెం మండలంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాలతో పాటు ఇప్పటికే కొనసాగుతున్న గ్రంథాలయాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఇంటర్నెట్ సౌకర్యం అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచాలని ఆయనకు విజ్ఞప్తి చేశారుగ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా చదువుకునే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని కనుబుద్ది దేవా తెలిపారుదుమ్ముగూడెం మండలంలోని గ్రంథాలయాల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు గారిని కోరారు.

## మండపాల వద్ద భక్తి కార్యక్రమాలు నిర్వహించాలి

సారపాక, ప్రభాతవార్త:

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద భగవద్గీత, భక్తి పాటలు, భజన కార్యక్రమాలు నిర్వహించాలని పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తవరపు రాజశేఖర్ సూచించారు. సారపాక ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండపం వద్ద గోమాత పూజ నిర్వహించి, హిందూ ధర్మం, గో ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. మట్టి వినాయక ప్రతిమలకు ప్రాధాన్యత ఇవ్వాలని, భరతనాట్యం, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. హిందూ ధర్మ పరిరక్షణలో పరశురాం పరివార్ సంస్థ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇందుప్రియ, లక్షి ్మ, సౌందర్య, శిరీష, కరిష్మా, వరలక్షి ్మ, మాధవి, స్పందన, తనూజ, వినీల, భూలక్షి ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా చట్టాలపై విద్యార్థినీలకు అవగాహన

దుమ్ముగూడెం: ప్రభాత వార్త (సెప్టెంబర్ 11)



దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న కస్తూరిబా విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినిలకు మహిళా చట్టాలు భద్రతపై దుమ్ముగూడెం పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు పోలీస్ అక్క కార్యక్రమంలో భాగంగా ఉమన్ చైల్డ్ సేఫ్టీ పై దుమ్ముగూడెం ఎస్సై జగన్మోహన చారి మహిళా కానిస్టేబుల్ శ్రీలక్షి ్మలు విద్యార్థినిలకు అవగాహన కల్పించారు

## సుభాష్‌నగర్ పేద విద్యార్థులకు 'ఆశాజ్యోతి'

### మూడు దశాబ్దాలుగా విద్యా సేవలు..

### మోడల్ స్కూల్‌గా గోపాలకృష్ణ ఎయిడెడ్ పాఠశాల

భద్రాచలం ,ప్రభాతవార్త:



భద్రాచలం సుభాష్‌నగర్‌లోని గోపాలకృష్ణ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఆశాజ్యోతిగా నిలుస్తోందని గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ అన్నారు.1995లో చిన్న గుడిసెలో ప్రారంభమైన పాఠశాల ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి నేడు అన్ని వసతులతో కూడిన మోడల్ స్కూల్‌గా రూపుదిద్దుకుందని తెలిపారు.1996 గోదావరి వరదల్లో పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతినడంతో రేకుల షెడ్డులో విద్యాబోధన కొనసాగించారని వివరించారు.ప్రధానోపాధ్యాయిని వేంపాటి ఉషారాణి కృషితో ఐటీసీ పేపర్‌బోర్డ్స్ సారపాక సహకారం పొందడంతో 2022లో నూతన పక్కా భవనం నిర్మించారని తెలిపారు.పాఠశాలకు ప్రహరీ, రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లు తదితర వసతులు కల్పించారని వార్డు సభ్యుడు కావూరి గోపి పేర్కొన్నారు.గ్రీన్ భద్రాద్రి సహకారంతో పాఠశాల ప్రాంగణం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారిందన్నారు.2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ప్రధానోపాధ్యాయురాలి కృషికి నిదర్శనమని కొనియాడారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఇదే పాఠశాలలో చదువుకున్నారన్న విషయం విశేషమని తెలిపారు.విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో కనీస అభ్యసనా సామర్థ్యాలు సాధించారని ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు అభినందించారు.అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు నూతన ఏకరూప దుస్తులు అందజేసి, సర్పంచ్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ ను వెంటనే అరెస్టు చేయాలి

### పలువురు సర్పంచులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:



సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయనపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని బూర్గంపహాడ్ మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లక్షి ్మపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు. కేటీఆర్ వ్యాఖ్యలపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ లు కిషోర్, నాగరాజు, సుభద్ర, వాణి, పద్మ ,నిరోషా, నరసింహ, మంగమ్మ, నాగమణి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మార్క్సిస్టు మేధావి

భద్రాచలంక్రైమ్, ప్రభాతవార్త:



సిద్ధాంత అవగాహనతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను విశ్లేషించిన సీతారాం ఏచూరి మార్క్సిస్టు మేధావి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి అన్నారు.సీపీఎం 13వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో ఏఎంసీ కాలనీలో శుక్రవారం సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేసిన ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమానికి విశేష సేవలందించారని నర్సారెడ్డి తెలిపారు.అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.ప్రపంచంలోని పలు కమ్యూనిస్టు దేశాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి పలు పుస్తకాలు రచించారని పేర్కొన్నారు.యూపీఏ1 ప్రభుత్వం ఏర్పాటులోనూ, ఇండియా కూటమి రూపకల్పనలోనూ ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు.పార్లమెంటు సభ్యుడిగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రశంసలు పొందారని గుర్తుచేశారు.దేశంలో పెరుగుతున్న మతోన్మాద, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించడమే ఏచూరికి నిజమైన నివాళి అని నర్సారెడ్డి అన్నారు.కార్యక్రమంలో అల్లాడి సత్యవతి, బుయ్యని వెంకటరత్నం, గుండె లక్షి ్మ, శ్రీదేవి, నరసమ్మ, భారతమ్మ, శ్రీను, రావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతా నిబంధనలు పాటించాలి

**ఎస్ఐ మేడ ప్రసాద్**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:

గణేష్ నవరాత్రుల నేపథ్యంలో మండపాల నిర్వాహకులు, మండల సర్పంచులతో శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మేడ ప్రసాద్ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు పోర్టల్‌లో మండపాల వివరాలను నమోదు చేసి ముందస్తుగా అనుమతులు పొందాలని సూచించారు.మండపాలకు విద్యుత్ అనుమతులు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాలు, ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి సదుపాయం లేదా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ డీజేలు వినియోగించరాదని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే లేదా రెచ్చగొట్టే పాటలు, నినాదాలను పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**డీఎస్పీ అరుణ్ కుమార్**

చర్ల, సెక్టంబర్ 11( ప్రభాతవార్త )



రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మొలగాలని ఎటువంటి అలజడులకు ఆస్కారం లేదన్నారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ అరుణ్ కుమార్ శుక్రవారం నాడు చర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను పిలిపించి వారి ప్రవర్తన ప్రస్తుత కార్యకలాపాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రౌడీ షీటర్లు ఇకపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో జీవించాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవనం సాగించాలని, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు.రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎస్పీ పోలీసు సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

## చింతగూడెం లో ఎస్ఐఆర్ ప్రక్రియపై విచారణల పరిశీలన

కల్లూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



పెనుబల్లి మండలం చింతగూడెం గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (సర్) ప్రక్రియలో భాగంగా అనామలీస్), నో మ్యాపింగ్ కేసులకు సంబంధించి నిర్వహిస్తున్న విచారణలను గౌరవ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణల నిర్వహణ, ఓటర్ల వివరాల పరిశీలన, సంబంధిత రికార్డుల ధృవీకరణ తదితర అంశాలను పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ఒక రోజు బ్యాంకుల సమ్మె విజయవంతం

**పి ఎల్ ఐ (పెర్ఫార్మన్స్ లింక్ ఇన్సెంటివ్) డిమాండ్ల కోసం**

ప్రభాతవార్త గాంధీ చౌక్ సెప్టెంబర్ 11.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో పనిచేస్తున్న సుమారు 8 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు గురువారం ఒకరోజు సమ్మె చేపట్టారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యు ఎఫ్ బి యు) పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పొట్ల వెంకటాలయ ప్రాంతంలో బ్యాంకు ఉద్యోగులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగుల ప్రధాన డిమాండ్ 5 రోజుల పని వారాన్ని వెంటనే అమలు చేయాలనేది. ఇప్పటికే బ్యాంకు యాజమాన్యాలు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) దీనికి అంగీకరించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి రావడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండవ ప్రధాన డిమాండ్ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పి ఎల్ ఐ (పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్) స్కీమ్ ను ఉపసంహరించుకోవాలని. ఈ ఒకరోజు సమ్మె కేవలం హెచ్చరిక మాత్రమేనని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల నిరవధిక సమ్మెకు,అక్టోబర్ 26 నుండి పూర్తిస్థాయి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ సమ్మెలో ఏ ఐ బి ఇ ఎ, ఏఐ బి ఓ సి, ఎన్ సి బి ఈ, ఏ ఐ బి ఎ ఒ, బి ఈ ఎఫ్ ఐ, ఐ ఎన్ బి ఈ ఎఫ్, ఐ ఎన్ బి ఓ సి అనే ఏడు యూనియన్లు ఐక్యంగా పాల్గొన్నాయి.

## ఎల్నినో ప్రభావిత పంటలను పరిశీలించిన బిజెపి జిల్లా కార్యదర్శి పాలా.నాగ సురేంద్ర రెడ్డి.

వేంసూర్,సెప్టెంబర్ 11,ప్రభాతవార్త.



ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఎల్నినో ప్రభావిత వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులకు న్యాయం జరిగేంత వరకు తోడుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం వేంసూరు మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా వేంసూరు మండల అధ్యక్షులు మాదిరాజు.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి పాల నాగ సురేంద్ర రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా ఆఫీస్ జాయింట్ సెక్రెటరీ గొర్ల శ్రావణ్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతుల విశ్వాసాన్ని కోల్పోయింధని కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకువస్తే ఈ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడం లేదని అమలు చేసి ఉండుంటే ఇలాంటి విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు అండగా ఉండేదని ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయడం లేదు కాబట్టి ఈ నష్టాన్ని ప్రభుత్వమే రైతులకు పరిహారం చెల్లిన్చలాని, కౌలు రైతులు ఒక్కొక్కరు ఎకరానికి 20000 ముందస్తు కవులు కట్టి ఇప్పటివరకు ఎకరానికి 15000 రూపాయలు పెట్టుబడి పెట్టి ఉన్నారని కానీ ఈ కానీ వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్ల ఒక్క రూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ప్రభుత్వం వెంటనే రైతన్నలను ఆదుకోవాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా శాఖ తరపున డిమాండ్ చేశారు.సీనియర్ నాయకులు దొడ్డపినేని కృష్ణయ్య మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ ఆర్భాటాలకి పేపర్ ప్రకటనలకే పరిమితమైందని ఇప్పటివరకు వెంసూరు మండలానికి గుక్కెడు నీళ్లు కూడా రాలేదని ఇకనైనా త్వరితగతిన సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెంసూరు మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి, బిజెపి బిజెపి ఖమ్మం జిల్లా కార్యదర్శి పాలనాగ సురేంద్ర రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఆఫీస్ జాయింట్ సెక్రెటరీ గొర్ల శ్రావణ్ కుమార్ రెడ్డి,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు కొప్పుల మధుసూదన్ రెడ్డి ,మండల కార్యదర్శి బండి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డపనేని కృష్ణయ్య,చల్లా అప్పిరెడ్డి,బండి ప్రభాకర్ రెడ్డి, తుమ్మూరు చంద్రమోహన్ రెడ్డి,ఖమ్మం పాటి.వెంకటేశ్వరరావు,బండి చెన్నకేశవరెడ్డి ,రఘుపతి రెడ్డి కార్యకర్తలు రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ల వెరిఫికేషన్‌పై అధికారులతో సమావేశం

ఖమ్మం టౌన్,ప్రభాతవార్త,సెప్టెంబర్ 11 :



ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియపై సంబంధిత వెరిఫికేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 4,500 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగింది. వీటి వెరిఫికేషన్ కోసం ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలకు చెందిన అధికారులను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు.వెరిఫికేషన్ అధికారులు తమకు కేటాయించిన డివిజన్లలో రేపటి నుంచి దరఖాస్తులను పరిశీలించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. చేయూత పెన్షన్ యాప్‌లో వెరిఫికేషన్ ప్రక్రియను ఏ విధంగా నిర్వహించాలి, వివరాలను ఎలా నమోదు చేసి అప్లోడ్ చేయాలనే అంశాలపై డీఆర్డీఓ అధికారులు డీసీ కేఎంసీ శ్రీనివాస్ రావు అధికారులకు అవగాహన కల్పించారు.ఒంటరి మహిళలు, వృద్ధులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు పెన్షన్ దరఖాస్తులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 25వ తేదీలోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేసి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో లు ఏ ఈ నరేంద్ర తేజ, యాకూబ్ నాయక్, యాకూబ్ అలీ, తిని ఫణికుమార్, సీనియర్ అకౌంటెంట్ సతీష్, సీనియర్ అసిస్టెంట్లు రవి, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రు, వెంకటలక్షి ్మ, దుర్గా సాయికిరణ్, ప్రవీణ్ కుమార్, శశికుమార్ లను వెరిఫికేషన్ అధికారులుగా నియమించారు.